వరంగల్ వార్త
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు
సోమవారం 27, ఏప్రిల్ 2026 | 16 పేజీలు



2 లో..

# జనాభా స్వీయ గణన.. ప్రారంభం

మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం

- 33 రకాల ప్రశ్నల వివరాలు నమోదు
- 14 ప్రాంతీయ భాషల్లో వివరాల నమోదు
- రెండు విడతల్లో జనగణన ఎన్యుమరేటర్లకు కొనసాగుతున్న శిక్షణ
- డిజిటల్ విధానంలో జనగణన

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త :** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జనగణన కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో జన గణన చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో మొదటి ఘట్టం ఆదివారం ప్రారంభమైంది. జనాభా స్వీయ గణన ప్రారంభించారు. మే 10వ తేదీ వరకు మొదటి విడతలో భాగంగా జనాభా స్వీయ గణన చేసుకునే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనాభా స్వీయ గణన ఆరంభమైంది. ఆయా జిల్లాల కలెక్టర్లు స్వీయ గణనకు సంబంధించి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయా మండలాల్లో అధికారులు విస్తృతంగా జనాభా స్వీయ గణనపై ప్రచారం నిర్వహించారు. దీంతో మొదటి విడత స్వీయ గణన ప్రారంభించడంతో ఇక జనాభా లెక్కలు ఆరంభమయ్యాయి.



2 లో..

# కవిత..., అప్పుడే ప్రశ్నించి ఉంటె తెలంగాణ ప్రజలు నమ్మేవారు

**తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ..**

**హన్మకొండ బ్యూరో..ఏప్రిల్ 26.(ప్రభాతవార్త)**

తెలంగాణ ప్రభుత్వం లో 10 సంవత్సరాలు అనుభవించి ఇప్పుడు నేను మంచి దానిని అనడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దోపిడీ పాలన చేసింది ఎవరో తెలంగాణ పల్లెల్లో ఎవరిని అడిగినా చెప్తారు. రేవంత్ రెడ్డి పాలనను రాక్షస పాలన అంటున్న కవితకు, ఎవరు రాక్షస పాలన చేశారో తెలియదా? దోచుకున్న డబ్బులో వాటా దొరక్కపోతే ఇప్పుడు వచ్చి తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుంటున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. 10 ఏళ్లలో తెలంగాణను దోచుకుని సర్వనాశనం చేసిన వాళ్లు, ఇప్పుడు

# ఐడీఓసిలో ఘనంగా వాసవి మాతా జయంతి వేడుకలు

పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



2వ పేజీలో...



## జనాభా స్వీయ గణన ప్రారంభం

### మొదటి పేజీ తరువాయి..

ప్రజలే తమ ఫోన్లు, కంప్యూటర్ల ద్వారా వివరాలను నమోదు చేసుకునే అవకాశం కలిగింది. ఈ క్రమంలో జన గణనకు సమయం ఆదా అవుతుందని కేంద్ర ప్రభుత్వం భావించి రెండు విడతల్లో జన గణన చేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కొనసాగుతుంది. జన గణనకు సంబంధించి ఎన్యుమరేటర్లకు శిక్షణ నాలుగు విడతల్లో ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రెండు విడుతల శిక్షణ పూర్తి చేశారు. ఈనెల 27 నుంచి మూడో విడత శిక్షణ ఇవ్వనున్నారు. స్వీయ గణనకు సంబంధించి వివరాలను ప్రజలు 15 నుంచి 20 నిమిషాల్లో నమోదు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో, మున్సిపాలిటీల పరిధిలో స్వీయ గణనపై విస్తృత ప్రచారం చేపట్టారు. 2011లో జనాభా లెక్కలను నిర్వహించారు. పది సంవత్సరాలకోసారి నిర్వహిస్తున్న జనాభా లెక్కలను తిరిగి 2021 లో నిర్వహించాల్సి ఉండగా కరోనా కారణంగా నిలిపివేశారు. ఈ క్రమంలో 2027 లో జనాభా లెక్కలను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మ్యాన్యువల్ పద్ధతిలో జనాభా లెక్కలు చేపట్టగా ఈసారి ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో డిజిటల్ విధానంలో జనాభా లెక్కలను చేపడుతున్నారు. ప్రతి ఉద్యోగి తమకు తెలిసిన వారికి స్వీయ గణనపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వము అందుబాటులోకి తెచ్చిన వెబ్సైట్లోకి వెళ్లాలి. గృహాల వివరాలకు సంబంధించి 33 రకాల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక కుటుంబానికి ఒక మొబైల్ నెంబర్ ఉపయోగించాలి. జిల్లా, పట్టణం, గ్రామం, పిన్ కోడ్ వివరాలను నమోదు చేయాలి. మొబైల్లో లొకేషన్ ఆన్ చేసి ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలి. సబ్మిట్ చేసిన తర్వాత ఏ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఐడి వస్తుంది. దానిని స్క్రీన్ షాట్ లేదా నోట్ చేసుకొని భద్రపరుచుకోవాలి. మే 11 తర్వాత ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారు. స్వీయ గణన నమోదులో పొరపాట్లు ఉంటే ఘనంగా అధికారికి తెలియజేస్తే సరి చేస్తారు. స్వీయ గణన ద్వారా ఎవరి వివరాలను వారే నమోదు చేసుకోవచ్చు. 33 రకాల ప్రశ్నలలో భాగంగా ఇంటి యజమాని పేరు మొదలుకొని భోజనం ఏం తీసుకుంటారు, వివిధ రకాల తాగునీరు, విద్యుత్ వినియోగం, డ్రైనేజీ, గ్యాస్ పొయ్యి వాడుతున్నారా లేదా కట్టెల పొయ్యి, ఏ వాహనాలు వాడుతున్నారు తదితర పూర్తి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. స్వీయ గణన కు సంబంధించి వివరాల నమోదుకు వెబ్సైట్ ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పనిచేస్తుంది. సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 1855 ను సంప్రదించవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్ లైన్ నెంబర్ పనిచేస్తుంది. ఉద్యోగ, ఉపాధి పరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన జన్మస్థలంతో సంబంధం లేకుండా ప్రస్తుతం నివసించే ప్రాంతంలోనే జనగణన చేసుకోవచ్చు. హాస్టల్స్ లో ఉంటూ చదువుకునే వారు కూడా అక్కడే నమోదు చేసుకోవచ్చు. ప్రభుత్వ పింఛన్లు, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులకు జనగణనతో సంబంధం లేదు. ఇంగ్లీషు, హిందీ తో పాటు 14 ప్రాంతీయ భాషల్లో వివరాలను నమోదు చేసుకోవచ్చు.

## కవిత..., అప్పుడే ప్రశ్నించి ఉంటె తెలంగాణ ప్రజలు నమ్మేవారు..

### మొదటి పేజీ తరువాయి..

ఆ పాపాలకు, కేసులు నమోదు అవుతుండడంతో మరోసారి ఆత్మగౌరవం, తెలంగాణ సెంటిమెంట్ వాడుకుంటున్నారు. గతంలో మా నాన్న కంటే రేవంత్ రెడ్డి బాగా పాలన చేస్తున్నారని అన్న నీ నోటితోనే, మళ్లీ రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని అనడం నీ విజ్ఞతకే వదిలేస్తున్నా. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే నువ్వు, తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు నీకు లేదు. నువ్వు ఇతర రాష్ట్రాల మద్యం వ్యాపారాల్లో తలదూర్చిన వారికి ఆత్మగౌరవం ఉందా?" ఉద్యమకారుల త్యాగాల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో, ఒకే కుటుంబానికి అన్ని పదవులు దక్కడం ఏ రకమైన సామాజిక న్యాయం?" అప్పుడు నీకు సామాజిక న్యాయం గుర్తుకు రాలేదా? రాష్ట్రంలో సాధారణ కార్యకర్తలకు రాని అవకాశాలు, కేవలం ఖికల్వకుంట్లఖి అనే పేరున్నందుకే మీకు దక్కుతున్నాయన్నది నిజం కాదా?" ఇదేనా మీ సామాజిక న్యాయం?మీ ప్రభుత్వం హయాంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై స్పందించని నువ్వు, జాతీయ స్థాయిలో మహిళా హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది.మీ మీద వచ్చే అవినీతి ఆరోపణలను తెలంగాణ సమాజంపై దాడిగా చిత్రీకరించడం ఆపండి.ఆరోపణలు మీ వ్యక్తిగత వ్యాపారాలకు సంబంధించినవి, తెలంగాణ ప్రజలకు సంబంధించినవి కావు.

# వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలి

**ప్రజారోగ్యంపట్ల నిరక్ష్యం వహిస్తే చర్యలకు సిఫారసు చేస్తా**

**ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి**

**సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి**

**సమీక్షా సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

వైద్యశాలలపై మరింత పర్యవేక్షణ పెరగాలని, ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం నిరక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా వైద్యశాల మొదలుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు ఎక్కడా మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాన్య ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి అందు బాటులో ఉన్న వనరులతోనే నాణ్యమైన చికిత్స అందించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. వైద్యశాలల్లో రోగులకు, సహాయకులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని, పారి శుధ్యం, నీటి వసతి వంటివాటిపై ప్రేత్యేక ద్రుష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతా ల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలని, మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, అవసరమైన వైద్య పరికరాలు మరియు మందుల నిల్వలపై సమగ్ర నివేదికను వెంటనే తనకు అందజేయాలని అధికారులను కోరారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని, అప్పుడే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## బంకుల్లో నో స్టాక్.... పెట్రోల్ , డీజిల్ కోసం కష్టాలు

జూలూరుపాడు, ప్రభాతవార్త, ఏప్రిల్ 26:

పశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ముందు నుంచే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో గత కొద్ది రోజులుగా మండలంలో వీటి కొరత స్పష్టంగా కనిపిస్తోంది. మండల పరిధిలో మూడు పెట్రోల్ బంకులు ఉండగా గత పది రోజులుగా బంకులకు పెట్రోల్ డీజిల్ సరఫరా తగ్గిపోయింది. అరకొర ఇబ్బందులు పడుతున్నా కానీ ప్రజలకు పెద్దగా సమస్య కాలేదు. కానీ రెండు రోజులుగా మూడు బంకులకు పెట్రోల్ డీజిల్ రవాణా సక్రమంగా జరగడం లేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వేసవికాలం కావడంతో పొలం దుక్కులు, భూమి చదును పంది పనుల కోసం జెసిబిలు, డోజర్లు, ట్రాక్టర్ల వంటి యంత్రాల వినియోగం ఎక్కువైంది. దీని కారణంగా సహజవాడకం కంటే డిమాండ్ మరింత పెరిగింది. ఇదే సమయంలో బంకులకు పెట్రోల్, డీజిల్ సరఫరా తగ్గటంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం రెండు బంకుల్లోనూ పూర్తిగా నో స్టాక్ బోర్డ్ పెట్టగా, ఒక బ్యాంకులో ఉన్న కొద్దిపాటి పెట్రోల్, డీజిల్ సాయంత్రం సమయానికే ఖాళీ అయిపోయింది. కొద్ది మోతాదులో ఉన్న బంక్ వద్ద పెట్రోల్, డీజిల్ కోసం జనం బారులు తీరారు. తమ వాహనాలను పక్కనపెట్టి క్యాన్లను క్యూలో పెట్టారు. పరిస్థితిని గమనించిన నిర్వాహకులు ముందుగా టోకెన్లు ఇచ్చి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సి వచ్చింది.

## ఐ.యల్.పి.ఏ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా భానుప్రియ ఏకగ్రీవ ఎన్నిక

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త



ఇండియన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్ (ఐ.యల్.పి.ఏ) జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా కొత్త గూడెం బార్ అసోసియేషన్ సభ్యురాలు మహిళా న్యాయవాది సుంకర భాను ప్రియ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. నాగపూర్ లో జరిగిన జాతీయ మహ సభలో ఇండియాన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్ జాతీయ కౌన్సిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షురాలిగా సుజాత చౌదంతే, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యన్.జే.సాంసన్ కార్యవర్గ సభ్యురాలిగా సుంకర భానుప్రియ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జ్యోతిరావు పూలే, డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం తో ఆవిర్భావించిన ఇండియన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్(ఐ.యల్.పి.ఏ) న్యాయవాదుల అభ్యున్నతి కోసం న్యాయవాదుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తు, సమాజం లో అణగారిన వర్గాల ప్రజలకు రాజ్యాంగ ఫలలు అందరికీ అందాలని, సమానత్వం కోసం, సమన ఆవకాశాలు అందరికి అందాలని సమసమాజ నిర్మాణం కోసం బామ్ సేఫ్ కు అనుబంధం గా పని చేస్తున్న సంస్థ ఇండియన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్ అని సుంకర భానుప్రియ తెలిపారు. పూలే అంబేద్కర్ ఐడియలజీ, పే బ్యాక్ టూ సోసైటి లక్ష్యంగా పని చేస్తున్న సంఘం ఐ.యల్.పి.ఏ లో అందరు సభ్యులుగా చేరి సమసమాజ నిర్మాణం లో భాగస్వామ్యం కావాలని భానుప్రియ పిలుపునిచ్చారు. భానుప్రియ నియమకం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరోసారి నిలిపిందని ఇండియాన్ లీగల్ ప్రోఫేషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర భాధ్యులు న్యాయవాదులు జనపరెడ్డి గోపి కృష్ణ, మారపాక రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, డి.సామంత్, యెర్రా కామేష్, యెర్రాపాటి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

# తండావాసులకు చేతిపంపు నీరే ప్రాణాదారం

**చెన్నారావుపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

నేటి ఆదునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి కొంత మంది ప్రజలు అనాధి కాలం నుండి వస్తున్న ప్రకృతిపైనే ఆదారపడి ఉంటారనడానికి మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామశివారు చంద్రుతండా నిదర్శనంగా నిలుస్తుంది. బయటికి వెళ్లిందంటే గుక్కెడు నీటి కోసం బాటిల్లను కొనుగోలు చేయడమే కాక ఇంటికి సైతం మినరల్ వాటర్‌ను తీసుకొచ్చే నేటి రోజుల్లో ఆ తండా వాసులు ఎలాంటి కలుషితానికి పోకుండా కేవలం స్వచ్ఛమైన చేతిపంపు నీటినే ప్రాణాదారంగా



సేవిస్తూ ప్రత్యేకతను కలిగి ఉందని చెప్పవచ్చు.

**-పదేండ్లుగా చేతిపంపు నీరే జీవనాధారం...**

కాగా ఈ తండా రోడ్డు చెంతనే ఉండగా సమీపంలోనే గత పది సంవత్సరాల క్రితం ప్రభుత్వం చేతిపంపును ఏర్పాటు చేసింది.



తండావాసుల అదృష్టమో లేదా ప్రకృతి అందించిన ప్రసాదమో కాని నాటి నుండి నేటి వరకు తాగు జలాలకు ఆ చేతి పంపుపైన్నే ఆదారపడి ఉన్నారు. ఈ తండాతో పాటు తిమ్మరాయినిపహాడ్ సమీపంలోని పాపయ్యపేట, ఎర్రగడ్డతండా, ధర్మతండా, బీసీకాలని, ఎల్లాయిగూడెం, నడిగడ్డతండా, హట్యతండా పరిసర తండావాసులు దూరమైనప్పటికి ఈ చేతిపంపు నీరే తీసుకెళ్తుంటారు.



**-మినరల్ వాటర్ వద్దు.. చేతి పంపు నీరే ముద్దు...**

నేటికి ప్రతి గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో శుద్ధి చేసిన మిషన్ భగీరథ త్రాగునీటితో పాటు గ్రామ పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంట్ సైతం ఉన్నాయి. అలాంటి వాటిని పక్కనపెట్టి త్రాగునీటికి కేవలం చేతిపంపు పైన్నే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పగలు రాత్రి అనే తేడాలేకుండా ప్రజలు నిత్యం ఇదే నీటిని తీసుకెళ్తున్నారు. కలుషితం లేని సురక్షిత నీరే కాకుండా ఆరోగ్యనికి కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదనే నమ్మకంతోనే తాము ఇదే నీటిని త్రాగుతున్నామని తండావాసులు పేర్కొంటున్నారు.

**-ఫ్లోరైడ్ రహిత త్రాగునీరు: సర్పంచ్ రమేష్..**



ఈ చేతి పంపు నీరు ఫ్లోరైడ్ రహిత త్రాగునీరని గ్రామ సర్పంచ్ దారావత్ రమేష్ ప్రభావార్తతో పేర్కొన్నారు. ఇట్టి నీటిని సంబంధిత ప్రభుత్వ అధికారులతో పరీక్షించడం జరిగిందన్నారు. మినరల్ వాటర్ కంటే నాణ్యమైనదిగా వారు చెప్పడం జరిగిందన్నారు. చేతిపంపును సంరక్షిస్తూ ప్రజల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## వదూవరులను ఆశీర్వదించిన చైర్మన్ దంపతులు

**నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

పట్టణ వాస్తవ్యులు కత్తి కిరణ్ సరితల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం లక్ష్మీరామానంద్ దంపతులు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిర్నిబావి జీఆర్‌బి గార్డెన్స్‌లో నర్సంపేట పట్టణ వాస్తవ్యులు గందె సునీత రవీందర్‌ల కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఖానాపురం రోడ్డు లో గల పెద్ద రంగారెడ్డి ఫంక్షన్ హాల్ నందు మాజీ కౌన్సిలర్ శీలం రాంబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, మున్సిపల్ కౌన్సిలర్ పొన్నాల మనిషా



ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు చిప్ప నాగ, ఉప్పల శాలూమ్, దేవోజు హేమంత్, చీకటి శివమణి, భూక్యా గణేష్, కొర్ర రాహుల్, బైకాని రాకేష్, నాడెం కన్నా, అభి తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ బలిదానం వృదా కాలేదు

**-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

ఆర్టీసీ సమ్మె విజయవంతం కావడం, కార్మికుల డిమాండ్ల ప్రభుత్వం పరిష్కారానికి ముందుకు రావడం శంకర్ గౌడ్ బలిదానం వలనే సాధ్యమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా నర్సంపేట డిపో వద్ద ఆత్మ బలిదానం చేసిన కోలా శంకర్ గౌడ్ కుటుంబాన్ని నేడు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ నిరంజన్, బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్‌లు వారి కుటుంబాన్ని పరామర్శించారు. మొదటగా నర్సంపేట డిపో వద్ద శంకర్ గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ముత్తోజిపేట గ్రామంలో వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యమంలో శంకర్ గౌడ్ బలిదానం వృధా కాలేదని, వారి బలిదానంతోనే రాష్ట్ర ప్రభుత్వం బెంబేలెత్తి ఆర్టీసీ జేఏసీ పెట్టిన అన్ని డిమాండ్లను పరిష్కరించడానికి ముందుకు వచ్చి జేఏసీతో చర్చించి చర్చలను ఫలప్రదం చేసిందని ఆయన తెలిపారు. ప్రభుత్వంతో పాటు ఆర్టీసీలోని కార్మిక సమాజం అండగా నిలబడాలని అందుకు అనుగుణంగా తమ వేతనాలు నుండి



కొంతమేరకు శంకర్ గౌడ్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆర్టీసీ ఉద్యోగులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ద్యాగల శ్రీనివాస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి స్వామి, కృష్ణ, గడ్డం యాదగిరి, శ్రీనివాస్, ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నూరు రవి ముదిరాజ్, కార్యదర్శి గుడిసెల అశోక్ గౌడ్, సుమన్ గౌడ్, కడారి సురేష్ యాదవ్, మండల అధ్యక్షులు బర్ల యాకయ్య, శ్యాం కుమార్ యాదవ్, శ్రీరామ్ శెట్టి రాజు, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నెక్కొండ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

మండలంలోని గొట్లకొండ తండాలో మొట్టమొదటగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతు యాసంగి సీజన్ కీ సంబందించిన వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేయడమే కాకుండా సన్నవడ్ల కు 2389మద్దత్తు ధర ఇస్తూ 500రూపాయల బోనస్ కూడా ప్రభుత్వం రైతులకు 48గంటలలో వారి అకౌంట్లలలో జమచేయడం జరుగుతుంది కావున రైతులు అందరు మీకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లలో అమ్ముకొని దళారుల చేత మోసపోకుండా ఉండాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, ఎంపీడీఓ యాసం లావణ్య, ఏపీఎం



కిరణ్ కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు రజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ తదితరులు పాల్గొన్నారు.






## యువకుడు మృతికి కారణమైన వ్యక్తులు అరెస్టు

**ఖానాపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

మండలంలోని పాఖాల వాగు వద్ద సిద్దార్థ మృతికి కారణమైన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21న సిదార్థ వారి స్నేహితుని పుట్టిన రోజుకు అని ఐదుగురు స్నేహితులతో కలిసి పాఖాల సరస్సు గిరకతాడు ప్రాంతంలో మద్యం సేవించారు. మధ్యం మత్తులో సిద్దార్థని తన స్నేహితులు బలవంతంగా నీటిలోకి నెట్టడంతో అక్కడ ఊబి ప్రాంతం ఉండటంతో సిద్దార్థ నీళ్లలో పడి బయటికి రాక మృతిచెందాడు. ఈ విషయాన్ని స్నేహితులు ఎవరికి తెలియద్దని సిద్దార్థ యొక్క టూవిలర్ వాహనాన్ని మొబైల్ ఫోన్‌ను దాచిపెట్టే ప్రయత్నంలో పోలీసులు వారిని పట్టుకొని విచారించగా సిదార్థ మృతికి మేమే కారణమని ఒప్పుకున్నట్లు సిదార్థ మృతికి కారణమైన విగ్నేష్, అశ్విత్‌తేజా, శ్రీచరణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## నీటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఖానాపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



వేసవి సెలవులలో పిల్లలు నీటి ప్రమాదాలకు ఎక్కువగ గురువుతున్నారని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. వేసవి కాలం ప్రారంభం అయిన సందర్భంగా పిల్లలు చెరువులు, కాల్వలు, బావులలో తోటి పిల్లలతో కలిసి సరదా కోసం ఈతకు వెళ్లే సందర్భాలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తల్లిదండ్రులు పిల్లలను ఎటువెళుతున్నారో గమణిస్తూ ఉండాలని వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కోరారు. పిల్లలు ఈతకొట్టే సందర్భాలలో లోతైన ప్రదేశాలకు వెళ్లవద్దని తల్లిదండ్రుల సమక్షంలోనే ఈతలకు వెళ్లాలని అన్నారు. పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండటం ఎంతో అత్యవసరమని అన్నారు.

## కోదండరామ్‌ని కలిసిన టిజెఎస్ నాయకులు

**నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొ కోదండరాం సార్‌ని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ కలిసి పుష్పగుచ్చం అందించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల కొరకు వారికి సరియైన గుర్తింపు ఇవ్వాలని ఉచిత విద్య ఉచిత వైద్య సదుపాయాలు ఉద్యోగా అవకాశాలు కల్పించాలని ప్రజా సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని మొదలగు ప్రజా సంక్షేమ పథకాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావీద్, రాష్ట్ర కమిటీ సభ్యులు భోన గాని రవీందర్ మిత్రుడు సిరాజ్ తదితరులు ఉన్నారు.

## గ్రామ గ్రామాన బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలి

**నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



గ్రామ గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ జెండాలు ఆవిష్కరించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో, ప్రతి గ్రామం, ప్రతి తండాలో గులాబీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పూర్వవిద్యార్ధుల సమ్మేళనం

**నెక్కొండ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నెక్కొండ వాసవి కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఉపాధ్యాయులను స్టేజ్ పైకి ఆహ్వానించి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫోటోకి పూల మూలవేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం 2005-2006 బ్యాచ్ కి చెందిన విద్యార్థులు తమ తీపి గుర్తులను నెమరు వేసుకొని ఆటల పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుమారు 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థుల తరఫున బాధ్యత వహించిన రామారపు విజయ్ తెలిపారు.




## సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో



జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుండి జనగణన డిజిటల్ నమోదు కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తన నివాసంలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో స్వయంగా తన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకోవడం వల్ల ప్రజల సమయం ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. మే 11వ తేదీ నుండి ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఆ సమయంలో ముందుగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసిన వారు నమోదు సమయంలో పొందిన ఐడి నంబర్ తెలియచేయాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమ రేషన్ చేసిన ప్రతి ఒక్కరూ ఐడి నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజలు అందరూ బాధ్యతతో పాల్గొని జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఓ జవహర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

### కాటారం కాళేశ్వరం ప్రధాన రహదారిపై హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కాటారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త




రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కాటారం సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం నడుం బిగించింది. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, కాటారం డీఎస్పీ ఎ. సూర్య నారాయణ పర్యవేక్షణలో రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కమలాపూర్ క్రాస్ రోడ్డు నుండి కాళేశ్వరం వరకు గల ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్ ) పోలీసులు గుర్తించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా ఆయా ప్రదేశాల్లో స్పష్టంగా కనిపించే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మలుపులు, స్కూల్ జోన్లు మరియు ప్రమాదకరమైన జంక్షన్ల వద్ద ఈ బోర్డులు వాహనదారులకు ముందస్తు సమాచారాన్ని అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ.. వాహనదారులు అతివేగాన్ని నియంత్రించుకోవాలని, ముఖ్యంగా మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అతివేగం వద్దు..నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలన్నారు. హెచ్చరికల పాటింపు వంటి బోర్డులపై ఉన్న సూచనలను గమనిస్తూ ప్రయాణించాలన్నారు. హెల్మెట్ అండ్ సీట్ బెల్ట్ లను ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని పోలీసులు కోరారు. ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న ఈ చర్యల పట్ల స్థానిక ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో కాటారం అకాడమీ సత్తా

### సిల్వర్ మెడల్ కైవసం

కాటారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ టాలెంట్ హంట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధులుగా వెళ్లిన కాటారం ట్రైబల్ వెల్ఫేర్ హ్యాండ్ బాల్ అకాడమీ జట్టు అద్భుత ప్రదర్శనతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 24 నుండి 26 వరకు జరిగిన 8వ రాష్ట్ర స్థాయి పోటీలలో కాటారం కుర్రాళ్లు తమ క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుని వెండి పతకాన్ని సాధించారు.

**ఏసీపీ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం...**

టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు, ఏసీపీ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు ఆయన చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ మాట్లాడుతూ.. అకాడమీ క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి జిల్లాకు పేరు తెచ్చారని కొనియాడారు.

**కోచ్ శిక్షణలో రాణించిన జట్టు...**

మూల వెంకటేష్ కోచ్‌గా వ్యవహరించి జట్టును సమర్థవంతంగా ముందుకు నడిపించారు. ఆయన అందించిన శిక్షణ వల్లే రాష్ట్ర స్థాయిలోని బలమైన జట్లను ఎదుర్కొని రన్నరప్‌గా నిలవగలిగామని క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులను కాటారం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సోమోజీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఏ. మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. వెంకటయ్య, కళాశాల పీడీ కుడిమేత మహేందర్, పీఈటీ మంతెన శ్రీనివాస్, కోచ్ మూల వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ రజనీకాంత్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొని జట్టు విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### మహాదేవ్‌పూర్ బాలుర పాఠశాలలో

## లక్షల విలువైన ప్రభుత్వ సంపద అన్యాక్రాంతం

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

మహాదేవ్‌పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న 8 తరగతి గదుల డిమాలిషన్ సందర్భంగా వచ్చిన సుమారు రూ. 5, 6 లక్షల విలువైన కలప, ఇతర నిర్మాణ సామాగ్రి బహిరంగ వేలం వేయకుండా అక్రమంగా తరలించబడిందని స్థానికులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ సంపద కొట్టుకుపోవడంపై మంథని నియోజకవర్గం ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని బిఆర్ఎస్ మంథని నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి గీత ఆరోపించారు. ఏప్రిల్ 19న పాఠశాల గ్రౌండ్ నుండి విలువైన కలప, ఇనుప రడ్డీలు, సిమెంటు బస్తులు, ఇతర నిర్మాణ సామాగ్రిని లారీల్లో బయటకు తరలించినట్లు స్థానికులు చూసారన్నారు. ఈ మెటీరియల్ విలువ కేవలం కలపకే దాదాపు రూ. 5, 6 లక్షలు, మట్టితో కలిపితే రూ. 10 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు లేదా పాలక వర్గం నుండి పూర్తి స్పష్టత లేకపోవడంతో స్థానికుల్లో అనుమానాలు పెంపొందాయి. ఎంఈఓ, ఏఈ లను ఈ విషయాన్ని వివరించమని ప్రజలు అడిగినప్పుడు మాకు ఎలాంటి సంబంధం లేదు అని స్పష్టత లేని సమాధానం ఇచ్చారని ఆ ం ల్లో ప్ ణ ల ి వెల్లువెత్తుతున్నాయన్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఫోన్‌కాల్స్‌కి స్పందించడం లేదని, స్థానిక పాలక వర్గం నేరుగా జోక్యం చేసుకుని అక్రమాలకు పాల్పడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, డిఈఓ కార్యాలయాలకు రాస్తూ ఫిర్యాదు చేసినప్పటికీ 4 రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ కాలంలో కూడా పాఠశాల నుండి మెటీరియల్‌ను తరలించడం ఆగలేదని, ఫిర్యాదు తర్వాత కూడా అక్రమ రవాణా కొనసాగిందని ప్రజా సంఘాలు వాపోతున్నాయి. రూ. 5, 6 లక్షల విలువైన కలప, మట్టితో కలిపి మొత్తం దాదాపు రూ. 10 లక్షల వరకు విలువ చేసే ప్రభుత్వ సంపద అన్యాక్రాంతమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించే బదులు, ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ కాకుండా వ్యక్తిగత జేబుల్లోకి వెళ్లిందని స్థానికులు అనుమానిస్తున్నారు. గ్రామపంచాయతీ పాలక వర్గం, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజా సంఘాలు



నిందిస్తున్నాయి. ఇసుక క్వారీల నుండి విద్యా సౌకర్యాల వరకు పాలక వర్గం జోక్యం చేసుకుంటూ అక్రమాలు చేస్తోందని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. స్థానిక మంత్రి శ్రీధర్ బాబు ఘటనపై వెంటనే జోక్యం చేసుకొని, తదుపరి అక్రమాలు ఆపాలని బిఆర్ఎస్ మంథని నియోజకవర్గ అధ్యక్షురాలు కేదారి గీత డిమాండ్ చేశారు. అక్రమంగా తరలించిన మొత్తం మెటీరియల్‌ను తిరిగి పాఠశాలకు చేర్చాలని, ప్రభుత్వ సంపద విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపయోగపడాలని కోరుతున్నట్లు ప్రకటించారు. ఈ అక్రమానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి దుర్వినియోగాలు జరగకుండా నివారణ చర్యలు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నట్లు పేర్కొన్నారు. మహాదేవ్‌పూర్ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, యువత కలిసి ప్రభుత్వ సంపద రక్షణకు ముందుకు రావాలని కోరారు.

## రామిళ్ల కిరణ్ కుమారుడిని పరామర్శించిన పుట్ట మధూకర్, శైలజ దంపతులు

కాటారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

కాటారం మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ రామిళ్ల కిరణ్ కుమారుడు యువిన్‌కు ఇటీవల చేయి ఫ్రాక్చర్ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లిన మంథని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత పుట్ట మధూకర్ మరియు మంథని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పుట్ట శైలజ దంపతులు బాబును పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి... బాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు, ధైర్యంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని, బాబు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షి ంచారు. తమ కుమారుడిని పరామర్శించడానికి వచ్చిన పుట్ట దంపతులకు రామిళ్ల కిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ



పరామర్శలో వారి వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవిమాత జయంతి వేడుకలు

**జనగామ టౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



జనగామ డీసీపీ కార్యాలయంలో ఆదివారం వాసవిమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటానికి డీసీపీ బి. రాజమహేంద్ర నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవిమాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఆర్యవైశ్యులు మహత్తరమైన సేవా కార్యక్రమాలతో పేద కుటుంబాలకు సహాయం చేస్తుంటారని, మున్ముందుకూడా వారు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని డీసీపీ సూచించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్యులకు వాసవిమాత జయంతి శుభాకాంక్షలు తెలియచేశార. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కె.సంపత్, జి.ప్రసాద్, తాటికొండ రవి, డ్రైవర్ శ్రీను, గన్‌మెన్ శ్రీను, ఏఆర్ గాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



**జనగామ టౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కులదైవం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 334వ ఆరాధన ఉత్సవాన్ని విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తోజు సిద్ధిరాములు చారి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జనగామ పట్టణలోని శ్రీ సంతోషిమాత ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువైనటువంటి శ్రీ గోవిందమాంబ ఈశ్వరి మాత సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు పారునంది శ్రీనివాస శర్మచే అభిషేకములు అలంకరణ నిర్వహించి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ దంపతులు అందరి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీపా నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో దీగోజు సాంబాచారి, సాతెల్లి రాజు, బండ్ల మల్లేశం, బత్తోజు సిద్ధిరాములు, సరబోజు రాజు, కాసోజు సంతోష్, పడకంటి చంద్రమౌళి, వీరస్వామి, శివకుమార్, మధు, చక్రపాణి, మల్లికార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికి జామాయిల్ తోట దగ్ధం
## 10 ఎకరాలు తోట పూర్తిగా కాలినది

**చిన్నగూడూర్ ప్రభాత వార్త, ఏప్రిల్ 26,**

చిన్నగూడూరు మండలం లో నీ మేగ్య తండ గ్రామపంచాయతీ కి చెందిన భూక్యా బాషు నాయక్ కు చెందిన 10 ఎకరాల జామాయిల్



ప్రమాదవసత్తు దగ్ధం అయింది. పక్క చేనుకు చెందిన రైతు మొక్క జొన్న చేను చెత్తను కాల్చే క్రమంలో మంటలు పక్కన ఉన్న తోట కు వ్యాపించి తోట దగ్ధం అయినట్లు భూక్యా బాషు నాయక్ తెలిపారు. సుమారుగా 20 లక్షలు నష్టం జరిగినట్లు రైతు తెలిపారు. సదరు రైతు జామాయిల్ కటింగ్ వచ్చే టైం వరకు ఇలా జరిగింది రైతు తీవ్రత మనస్థాపానికి గురి అయ్యాడు. అంతేకాకుండా గ్రామంలో రైతులు ఇలాంటి సంఘటన బాధాకరమని అన్నారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రమాదవశాత్తు మొక్కజొన్న దగ్ధం



**కేసముద్రం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదంతో దొంతరబోయిన కొమురయ్యకు చెందిన 3 ఎకరాలు మరియు దొంతరాబోయిన సురేష్ 2 దొంతరబోయిన ఐలయ్య కి చెందిన 3 ఎకరాలు జక్కుల కట్టమల్లుకు 3మూడు ఎకరాలు పుణ్యపుర్తి ఐలయ్య చెందిన 4 ఎకరాలు పూర్తిస్థాయిలో మొక్కజొన్న పంట దగ్ధం కావడంతో రైతులు కన్నీరు మునిరయ్యారు. ఫైర్ స్టేషన్ కి సమాచారం అందించడంతో మంటలను ఫైర్ ఇంజన్ సహాయంతో అదుపు చేశారు కానీ దానికి ముందే తీవ్రస్థాయిలో 15 ఎకరాలలో ఆరుగలం పండించిన పంట ఒక్కసారిగా కాళీ బూడిదవడంతో ఇక ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# హైకోర్టులో దొంతికుంట సంచలనం
## బఫర్‌జోన్ తో సంబంధం లేదన్న ఇరిగేషన్
## చెర్వు లోపలే వాకింగ్ ట్రాక్ నిర్మాణమని ధృవీకరణ
## కోటగిరి వాదనతో ఏకీభవించిన ఇంజనీర్లు
## ఆమేరకు తీర్పు చెప్పిన న్యాయమూర్తి

**అశ్వారావుపేట/ప్రభాతవార్త**

దొంతికుంట చెర్వులో నిర్మింప తలపెట్టిన "వాకింగ్ ట్రాక్" ఈ సర్వే నెంబర్‌కి ఆనుకుని ఉన్న పట్టాభూమిలోకి వెళ్ళనీయమని నీటిపారుదల శాఖ హైకోర్టుకి ధృవీకరించింది. నెంబర్:1333లో గల ప్రైవేటు ల్యాండ్‌లోకి ట్రాక్ వస్తే తమకు పరిహారం చెల్లించాలంటూ యజమాని కోటగిరి రామమోహన్‌రావు తెలంగాణా హైకోర్టులో రిట్‌పిటిషన్ నెంబర్:10222/2026 ద్వారా పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. ఈ నేపధ్యంలో పైన పేర్కొన్నట్లుగా ఇరిగేషన్ కౌంటర్ దాఖలు చేయడమే కాకుండా..అండర్‌టేకింగ్ ఇవ్వడం గమనార్హం. ఇప్పటికే రెవెన్యూ సహకారంతో జాయింట్ సర్వే పూర్తిచేసి చెర్వు లొకేట్ అయినటువంటి 1349 హద్దులు అధికారికంగా నిర్ణయింపబడ్డాయని.,అందువల్ల పొరుగున దీనికి ఆనుకుని ఉండే పిటిషనర్(మోహనరావు) ల్యాండ్ కి ఎటువంటి నష్టం జరగదని అందులో జిపి స్పష్టం చేశారు. రూ.5కోట్ల ప్రాధమిక అంచనాలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి పాలనాపర మంజూరీలు ఉన్నాయని, పట్టణ ప్రజల సౌలభ్యం నిమిత్తం ఈ అభివృద్ధి చేపట్టామని కోర్టుకు వారు విన్నవించారు. బఫర్‌జోన్ లోకి ప్రవేశించే అవసరం లేనందున ఇక్కడ పరిహారం చెల్లింపు ప్రస్తావనే లేదని తేల్చిచెప్పారు. దీంతో న్యాయమూర్తి ఈమేరకు కేసుని డిస్పోజ్ చేశారు. అధికారులు చెబుతున్న దానికి విరుద్ధంగా ఏదేని చర్యలు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమైతే మాత్రం తిరిగి టెరిటోరియల్ జ్యురిడిక్షన్ లో తిరిగి న్యాయ సహాయం కోరవచ్చని ఆ తీర్పులో పిటిషనర్‌కి స్వేచ్ఛనివ్వడం కొసమెరుపు.

# అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా పెరుమాళ్ళ ప్రణయ్ కుమార్

**మునుగోడు,ఏప్రిల్26,ప్రభాతవార్త:**



మునుగోడులో అంబేద్కర్ సంఘం సమావేశంను ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశంలో నూతన కమిటీని నియమించారు. సంఘం అధ్యక్షుడుగా పెరుమాళ్ళ ప్రణయ్ కుమార్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షుడిగా ముచ్చపోతుల శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శిగా బెల్లపు బాల శివరాజు,కోశాధికారిగా ముచ్చపోతుల తరుణ్,సాంస్కృతిక కార్యదర్శి పెరుమాళ్ళ నరసింహ,ప్రచార కార్యదర్శిగా గోలి శ్రీనివాస్,క్రీడల కార్యదర్శిగా దాసరి సాయిచంద్ తోపాటు కమిటీ సభ్యులు నియమించబడ్డారు. గౌరవ సభ్యులు గాదరి శరణార్థి,గోలి చెన్నకేశవులు,ముచ్చపోతుల నరసింహ,పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్ సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.అనంతరం నూతన అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యత అప్పజెప్పినందుకు,సంఘం బలోపేతానికి కృషి చేస్తానని,ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికయిన కమిటీలో గోలి మారయ్య,గోలి చంద్రమోళి,లక్కయాదగిరి,లక్క స్వామి,పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు,పోగుల దేవేందర్,కులస్తులు,అంబేద్కర్‌సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రైతు భరసా మూడుసార్లు ఎగ్గొట్టారు

**బచ్చన్నపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా మూడుసార్లు ఇవ్వలేదని బచ్చన్నపేట బీజేపీ మండలపార్టీ అధ్యక్షులు బంగారు మహేష్ ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపట్ల చిత్తశుద్ధి లేదని, రైతుభరోసా విషయంలో ఇప్పటికి మూడుసార్లు ఎగ్గొట్టారని, ప్రస్తుతం వేసిన రైతు భరోసాలో ఎకరంకు వేసినట్లు, రెండవసారి ఎకరానికి వేసిన దానిలో సగంరైతులకే రెండుఎకరాల వరకు ఖాతాలో జమయ్యాయని, రెండు ఎకరాల వరకు పూర్తిస్థాయిలో వేయకపోవడం విచారకరమన్నారు. దీంతోపాటు యాసంగిలో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరిధాన్యం బస్తాలు ఇవ్వక కాంటాలు అయినవి తరలించడానికి లారీలు రాక పోవడంతో మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులపట్ల వివక్షత మానుకొని రైతాంగానికి పెద్ద పీట వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా కాంగ్రెస్ జెండా



**నర్మెట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

బడుగు బలహీన వర్గాలఅభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ జెండా ఎల్లప్పుడు పేదలకు అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మకూరు, మల్కపేటలలో పార్టీ శ్రేణులతో ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఆయన వెంట సర్పంచులు బానోతు మహేందర్, మాలోతు బుజ్జి, చందర్, డిసిసి ఉపాధ్యక్షుడు, కొమురవెల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ గంగం నరసింహారెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, మండలపార్టీ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పుస్తె మట్టెలు అందచేత



**బచ్చన్నపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

బచ్చన్నపేట మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ పారిశుద్ధ్య కార్మికురాలు మర్రి భారతి కనిష్ట పుత్రిక స్రవంతి వివాహం సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి రూ.35వేలు విలువైన పుస్తె మట్టెలు అందజేశారు. పుస్తె మట్టెలు సాయం అందజేసిన చల్ల శ్రీనివాసరెడ్డికి రుణపడి ఉంటామని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రోళ్ల విజయ సోములు, ఉపసర్పంచ్ తాడేం నరేందర్, మాజీ అధ్యక్షులు రాజుపేట గోపాల్ మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, కారోబార్ శేఖర్ పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో మేక మృతి

**గూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

మండలంలోని నాయకపల్లి గ్రామంలో పసునూరి కొమ్మాలు అనే మేకల కాపరికి చెందిన మేక ఒకటి విద్యుద్ఘాతానికి గురై ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మేతకై వెళ్లిన మేక గ్రామ సమీపంలోని పంట క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేక విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు.

# కర్రెగుట్టల్లో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ పర్యటన

## రహదారి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు.





**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త.** ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం కర్రె గుట్టలలోని జల్ల, డోలీ గ్రామాలను ఆదివారం సందర్శించింది. ప్రాంతీయ పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజలకు అందుతున్న సదుపాయాలపై ఎస్పీ ఆరా తీశారు. మురుమూరు నుండి పామునూరు, జల్ల, డోలీ మీదుగా తాడపాల వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనులను ఎస్పీ సమీక్షించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. రహదారి నిర్మాణ పనుల సందర్భంగా భద్రతా విధుల్లో పాల్గొంటున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ మాట్లాడి, వారి సేవలను అభినందించారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ శంకర్, వెంకటాపురం సీఐ రమేష్, సివిల్ సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగు వార్త

## కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు బాధ్యతల స్వీకరణ.

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, ఏప్రిల్ 26:**



ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల సమర్థ వంతమైన అమలు ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయని తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయంగా పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతికి వెల్లివిరిసిన సేవాగుణం

**పసర ఎస్. తాజుద్దీన్**



**గోవిందరావుపేట ప్రభాతవార్త** శాంతి భద్రతల పరిరక్షణే కాదు, సామాజిక సేవలోనూ తాము ముందుంటామని నిరూపించారు పస్రా ఎస్.ఐ. తాజుద్దీన్. వాసవి మాత జయంతి సందర్భంగా గోవిందరావుపేట మండల ఆర్య వైశ్య సోదర సోదరీమణులతో కలిసి ఆయన నిర్వహించిన పూజా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఉదయం వేళ ఆలయంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు, పాలాభిషేకం ఎస్ఐ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంత్రోచ్ఛారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఎస్ఐ వెంటనే సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు, బాటసారులకు స్వయంగా చల్లటి మజ్జిగ, త్రాగునీరు, అరటిపండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఖాకీ చొక్కా వేసుకుని స్వయంగా సేవ చేయడం చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వాసవి మాత జయంతి ర్యాలీలో ఎస్.ఐ. అంగరంగ వైభవంగా పాల్గొన్నారు. భక్తులతో కలిసి నడుస్తూ, ర్యాలీకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలతో మమేకమవ్వడమే నిజమైన పోలీసింగ్ అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల మనసు గెలుచుకున్న ఎస్.ఐ కేవలం కేసులు, లాఠీలకే పరిమితం కాకుండా పండుగలు, పబ్బాల్లో ప్రజలతో కలిసిపోతూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పస్రా ఎస్ఐ తీరుపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి అధికారులు ఉంటే పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం మరింత పెరుగుతుంది" అని స్థానికులు కొనియాడారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, ఏప్రిల్ 26:**



ములుగు జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ వాసవీ మాత చిత్రపటానికి జిల్లా అధికారులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీ మాత వైశిష్టం, ఆమె త్యాగనిరతిని కొనియాడారు. పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శాంతి, అహింస, ఆత్మగౌరవం కోసం ఆత్మార్పణం చేసిన వాసవీ మాత ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు.

మంగపేట ఏప్రిల్26, ప్రభాతవార్త.



శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం మంగపేట మండలం లోని కమలాపురం గ్రామంలోని శ్రీ రామాలయంలో కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్యులు నిర్వాహించారు. కార్యక్రమ విశేషాలు ప్రత్యేక పూజలు భక్తి పారవశ్యంతో జరిగాయి. అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం లో పాల్గొన్న ప్రముఖులు రాష్ట్ర నాయకులు సిద్ధం శెట్టి వైకుంఠం, జిల్లా గౌరవ అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి లక్ష్మణరావు, మంగపేట మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ధంశెట్టి కనకారావు, ప్రధాన కార్యదర్శి ఆనంతుల రవి గుప్తా, కోశాధికారి సింగిరికొండ శ్రీనివాస్ హాజరైన ఇతర పెద్దలు నేరెళ్ల బతకయ్య, నర్సయ్య, శ్రీనివాస్, సత్యం, మానాల అజిత్, సిద్ధంశెట్టి ఆనందం, వెంకటేశ్వర్లు, సుదీర్ కుమార్, ములుగు జిల్లా ఆర్య వైశ్య సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఐటీడీఏ పిఓ గా బాధ్యతలు చేపట్టిన లెనిన్ వాత్సల్ టోప్పో, ఐఏఎస్





**ప్రభాతవార్త ఏటూర్ నాగారం ఏప్రిల్ 26:** స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా లెనిన్ వాత్సల్ టోప్పో, ఐఏఎస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న చిత్రమిశ్రా రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో కరీంనగర్ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టగా అప్పటినుండి ఐటిడిఎ ఇంచార్జ్ పిఒగా ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహబూబాబాద్ అదనపు కలెక్టర్ గా పని చేస్తున్న లెనిన్ వాత్సల్ టోప్పో, ఐఏఎస్ నుప్రభుత్వం ఎటూర్ నాగారం ఐటీడీఏ పీవోగా నియమించగా విధుల్లో చేరారు .ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ప్రాజెక్ట్ ఆఫీసర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఐటీడీఏ యూనిట్ అధికారులతో సమీక్షించారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. నాగరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్/అడ్మినిస్ట్రేటివ్ ఎం. రాజ్‌కుమార్, మేనేజర్ వి. శ్రీనివాస్, అకౌంట్స్ మేనేజర్ కె. నర్సింగ్, పిసా కోఆర్డినేటర్ కె. ప్రభాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) కార్యక్రమంలో తహసిల్దార్ ఎం శ్రీనివాస్

**రాయపర్తి ప్రభాత వార్త**



**ఏప్రిల్ 26** రాయపర్తి మండలంలోని రాగన్న గూడెం గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ సరికొండ కృష్ణారెడ్డి మరియు రాయపర్తి గ్రామ సర్పంచ్ శ్రీమతి గారే సహేంద్ర బిక్షపతి మండల తహసిల్దార్ శ్రీ ఎం.శ్రీనివాస్ నేటి నుండి మొదలైన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేయించడం జరిగినది. ఇట్టి కార్య క్రమంలో మండల గిర్దావార్లు శ్రీ చంద్రమోహన్, శ్రీమతి సంధ్యా రాణి, ఎంపీఎస్ఓ శ్రీ కళ్యాణ్, జి పి ఓ లు పూజారి సురేష్ సంజీవయ్య కారోబార్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి సీతక్క**





**మల్లంపల్లి, ప్రభాతవార్త:** ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలు లబ్ధిదారుల కొత్త గృహాలకు ఆమె రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం నిర్వహించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల నివాస సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సురక్షిత నివాసం కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక కల అని, ఆ కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదలు, బలహీన వర్గాలకు గృహ సదుపాయం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మంత్రి వివరించారు. ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు రావాలని ఆమె సూచించారు. గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త ఇంటిలో అడుగుపెట్టడం తమ జీవితంలో ఒక మధురమైన ఘట్టమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు, ఉప సర్పంచ్ అంకం సురేష్, స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా వాసవి మాత జయంతి వేడుకలు

ప్రభాతవార్త ఏటూర్ నాగారం ఏప్రిల్ 26:





మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆనంద్ పాండే శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ , గౌరీ దేవత పూజ నిర్వహించి మహిళా మణులు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అంతరం ఆర్యవైశ్య మహిళలు వాసవి మాతకు ఒడి బియ్యం సమర్పించి మంగళ హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా వాసవి మాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య సంఘం నాయకులు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ , రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ ఈరోజు వాసవి మాత జయంతి ఉత్సవాలను ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాంతి, అహింస ,ఆత్మ గౌరవం కోసం ఆత్మార్పణం చేసిన వాసవి మాత చరిత్ర కుల మతాలకు అతీతంగా సమాజ హితం కోసం ఆమె త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బొలిసాని గౌరీ శంకర్, నూక ప్రభాకర్, బచ్చు సత్య నారాయణ, వెలగందుల మాధవ్, గంజి స్వామి, వెంకట్రాజ్యం, మదుగూరి ప్రసాద్, గంజి సాంబశివరావు, బచ్చు సతీష్, గంజి రమేష్ సిరిపురం చంద్రశేఖర్, గుంత రమేష్, గందె శివ శంకర్, బచ్చు చంద్రశేఖర్, సాంబయ్య, నాగరాజు, అమర సందీప్, గుండ రాజు, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పెట్రోల్ కొరత

**రెండు రోజులకు ఒక ట్యాంకర్ సప్లై చేస్తున్నారు.**

**అంటున్న బంకు యాజమాన్యం**

**సూపర్ పెట్రోల్ మాత్రమే విక్రయిస్తున్నాం,**

**అంటున్న మరో యజమాని**



**గోవిందరావుపేట ప్రభాతవార్త** అమెరికా ఇరాన్ యుద్ధ ప్రభావం మండలం పై స్పష్టంగా కనిపిస్తోంది. మండలంలో రెండు పెట్రోల్ బంకులు ఉండగా ఒక పెట్రోల్ బంకును ఆదివారం మూసివేశారు. కారణమేంటని అడగగా పెట్రోల్ అందడం లేదని తెలుపుతున్నారు. మరో పెట్రోల్ బంకులు సూపర్ పెట్రోల్ మాత్రమే విక్రయిస్తున్నారు. డిజిల్ కూడా కొరతగానే ఉందని ఒక్కొక్క లారీకి 100 నుండి 150 లీటర్ల వరకే విక్రయిస్తున్నట్లు యాజమాన్యం తెలుపుతోంది. ఈ కొరత ప్రభావం అన్ని రకాల వస్తువులపై పడుతుందని గృహిణులు వాపోతున్నారు. వంట గ్యాస్ బుకింగ్ 45 రోజులుగా ప్రభుత్వం నిర్ణయించగా బుక్ చేసిన వారం రోజులలో ఇస్తున్నా రని వినియోగదారులు తెలుపుతున్నారు. రేపటి నుండి ద్విచక్ర వాహ నానికి రెండు లీటర్లు మాత్రమే కొట్టడం జరుగుతుందని ద్విచక్ర వాహనదారులు తెలుపుతున్నారు. యుద్ధం ప్రభావం మనపై లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయంటూ ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. మరో పద్ధతి దిగులు పోతే మరో బంకు కూడా మూతపడే పరిస్థితి ఉందని వాహనదారులు తెలుపుతున్నారు. వరి కోత యంత్రాలు సహితం డీజిల్ కొరత కారణంగా గంటకి 2800/ గా ఉండగా మూడు వేల నుండి 3300/ వరకు తీసుకుంటున్నారని రైతులు ఆరో పిస్తున్నారు. ప్రతి కిరాణం సామాను ధరలు కూడా పెంచి అమ్ము తున్నారని కారణం ఏమిటంటే ట్రాన్స్ పోర్ట్ ధరలు పెరిగినందున తాము కూడా పెంచి అమ్మక తప్పడం లేదని కిరాణా షాపు యాజమాన్యాలు పేర్కొంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. యుద్ధం ఇలాగే కొనసాగితే ముందు ముందు మరింత విపత్కర పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. యోగదారులపై మరింత భారం పడుతుందని అంటున్నారు. సోమవారానికి మండలంలో పెట్రోల్ అందుతుందా లేదా అన్న ప్రశ్న ద్విచక్ర వాహనదారులను వేధిస్తోంది ఈసారి పెట్రోలు వస్తే ట్యాంక్ ఫుల్ చేయించుకోవాలని వినియోగదారులు ఆలోచిస్తున్నారు.

ఏటూర్‌నాగారం వార్త

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు

వెంకటాపురం అర్బన్ ప్రభాతవార్త :.



వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఈ పర్వదినాన్ని అధికారిక పండగగా ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గానికి వాజేడు మరియు వెంకటాపురం మండలాల ఆర్యవైశ్య సోదర సోదరీమణులు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసినారు. ఈరోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా వాజేడు మరియు వెంకటాపురం మండలాలలో ఆర్యవైశ్య సోదరీ సోదరీమణులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి102 రకాల నైవేద్యములు సమర్పించి, అనంతరం ప్రసాదములు అందజేసి, శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అలాగే, ఈ పుణ్యదినాన్ని పురస్కరించుకొని అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి, భక్తులకు మరియు స్థానిక ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొని భక్తి భావంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

## సీ ఎం. చిత్ర పటానికి పాలాభిషేకం

**హాజరైన గుమ్మడి సోమయ్య.**



**మంగపేట ఏప్రిల్26, ప్రభాతవార్త.** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్య ఆర్యవైశ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం ఆర్యవైశ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి సీ ఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వాహించారు. మాత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మహోన్నత జీవితాన్ని రాష్ట్ర స్థాయిలో గుర్తించి గౌరవించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా సమాజ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రశంసనీయం అని తెలిపారు. సీ.ఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులతో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, జిల్లా డీసీసీ నాయకులు పచ్చా శేషగిరిరావు, పెద్ది నరసింహ రావు, గ్రామ అధ్యక్షులు బేవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎరువుల దుకాణాల బంద్

**పరకాల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త )** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బంద్‌కు మద్దతుగా పరకాల పట్టణంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేస్తామని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల కంపెనీల విధానాలకు నిరసనగా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల ధరలు పెరగడం, లింక్ ఉత్పత్తుల వల్ల రైతులపై అదనపు భారం పడుతోందని, రవాణా ఖర్చులతో డీలర్లు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుని ఎరువుల ధరలు తగ్గించాలని, రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

**పరకాల, ఏప్రిల్ 26 (ప్రభాత వార్త**

)పట్టణంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 333వ ఆరాధన మహోత్సవం పరకాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకి కరుణాకరశాస్త్రి ఆచార్యత్వంలో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవాళి కాల భవిష్యత్తు గురించి ముందుగా హెచ్చరించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిలోక కల్యాణార్థం 16వశతాబ్దంలో జన్మించా న్నారు.ధర్మాన్ని ఆచరించిన వారికి ఎటువంటి ఆపదలు అపవాదులురావని తెలిపిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధిలోకి ప్రవేశించి 333 సంవత్సరాలు అయ్యిందన్నారు. బాల్యంలో17సంవత్స రాలు యుక్త వయస్సు లో 16 సంవత్సరాలు



తపస్సును ఆచరించి విశ్వశ్రేయస్సుకు అంకితమై తాళపత్ర గ్రంథాలలో విరచితం చేసిన 4లక్షల 32వేల సంవత్సరాల కలియుగానికి చెందిన 14వేల కాలజ్ఞాన తత్వ ప్రతుల ఆత్మజ్ఞాన బోధ అత్యంత మహిమాన్వితమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెలకంటి శ్రీనివాసా చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలోజు లింగమూర్తి, మండల ఉపాధ్యక్షుడు వెల్లంకి బుచ్చయ్య, ఆచారి గౌరవాధ్యక్షుడు తెలకుంట్ల కోటిలింగాచారి, చంద్రమోళి ఆచారి, కోశాధికారి కడి వెండి రవి, ప్రధాన కార్యదర్శి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ విలీనంపై హర్షం

**.కమలాపూర్: ప్రభాత వార్త.**

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ టీజీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల చిరకాల కోరికను తీర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ హనుమకొండ ఆర్టీసీ బస్ డిపోలో ఆదివారం పాలాభిషేక కార్యక్రమం అంబరాన్నంటే సంబరాల మధ్య జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చిత్రపటాలకు కూడా ఆర్టీసీ కార్మికులు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ నిర్ణయాన్ని కొనియాడారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. “ఆర్టీసీని మూసివేయడమే ఉత్తమమైన మార్గమని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కార్మికుల సమ్మెను అణచివేసి, 50 వేల కుటుంబాలను రోడ్డున పడేసే కుట్ర చేశారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని చూశారు“ అని ఆమె విమర్శించారు. అయితే మాట తప్పని, మడమ తిప్పని



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందని,ప్రగతి రథచక్రాలకు పునర్జీవం పోసి, కార్మికుల ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించారు.అని ఆమె గుర్తుచేశారు.దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది“ అని ఝాన్సీ రాణి అన్నారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలకు ఆర్టీసీ కార్మికుల తరఫున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సర్పంచిని అగౌరపర్చిన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

**భీమదేవరపల్లి: ఏప్రిల్ 26 (ప్రభాతవార్త)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కొత్తకొండ హరిత హోటల్ లో ఆదివారం రోజున సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నేషనల్ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున గ్రామసభలో ముస్తఫాపూర్ గ్రామ సర్పంచ్ గడ్డం సుజాతను మహిళా సర్పంచిని ఆ గౌరవ పరిచిన వ్యక్తులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు కోరడం జరిగిందని తెలిపారు. గతంలో మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు చేసిన పనులలో బిల్లులు పెండింగ్ లో ఉన్న పనులలో సమగ్రంగా విచారణ జరపాలని గ్రామాలలో అభివృద్ధి పనులపై



శ్రద్ధ చూపని పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని బొల్లోనిపల్లి నుండి గట్ల నర్సింగపూర్ మధ్య ఉన్న లింకులోడు సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏకంగా తీర్మానం చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిక ప్రదీప్, గడ్డకుమార్,స్వామి ,బోయిని మహేష్ ,గోపగోని తిరుపతి, సిద్ధమల్ల రమ ,గడ్డం సుజాత, కస్తూరి సుధాకర్, బొల్లంపల్లి అజయ్ కుమార్ ,బి మానస, మాచర్ల కుమార్ స్వామి, కొర్ర గోపాల్ , బి సునీత తదితరులు పాల్గొన్నారు

## శ్వేతార్కలో ముగిసిన వసంతోత్సవాలు

**ఏప్రిల్26(ప్రభాతవార్త)కాజిపేట్ మండల్**



సపరివార సమేత స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయం దివ్య క్షేత్రంలో 2026 శ్వేతార్క గణపతి స్వామి వారి 28 వవసంతోత్సవాలు,నిర్వహించినటువంటి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంతో సంపూర్ణంగా వసంతోత్సవాలనే పూర్తి నిర్వహించారు. టంటం దయాకర్ స్వామి ఆధ్వర్యంలో ఈ యొక్క వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు దేవాలయ సిబ్బంది భక్తులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.అనంతరం అన్నపూర్ణ భవన్లో అన్నదానం నిర్వహించారు. దేవాలయ సిబ్బంది మేనేజర్ లక్క.రవి అనిస్టెంట్ వేనేజర్, దుర్గం.సుధీర్, వి ఆర్వో వుని, గంటా. శ్రీనివాసరావు,పద్మ,గాయత్రి,త దితరులు,పాల్గొన్నారు.వసంతోత్సవాలను జయప్రదం చేసినటువంటి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలుపునట్టుగా దేవాలయ వ్యవస్థాపక,చైర్మన్,అయినవోలు.వెంకటేశ్వర శర్మ తెలిపారు

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం చారిత్రాత్మక నిర్ణయం

**పరకాల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త )**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల దశాబ్దాల పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందని మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ పాడి కల్పనాదేవి ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు జరిపిన చర్చలు సఫలం కావడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కల్పనాదేవి మాట్లాడుతూ.. 11 శాతం పీఆర్సీ అమలు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలకు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు కార్మిక లోకానికి దక్కిన గొప్ప విజయమని అభివర్ణించారు.. కానీ నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ‘ప్రజా పాలన’లో వారి ఆత్మగౌరవం పునరుద్ధరించబడిందని అన్నారు. కొందరు ఆర్టీసీ కార్మికులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికులు పిట్టల్లా రాలిపోతుంటే బీఆర్ఎస్ నేతలు ఆనాడు సంబరాలు చేసుకున్నారని దుయ్యబట్టారు. ఆర్టీసీని రాజకీయం చేస్తుంది బీఆర్ఎస్ నేతలేనని ఆరోపించారు. సీఎం రేవంత్ మంచి మనసున్న వ్యక్తి అని, ఆర్టీసీ కార్మికులకు అండగా నిలవడమే అందుకు నిదర్శనమని అన్నారు. ఆర్టీసీ కార్మికులతో సర్కారు చర్యలు సఫలం కావడం రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు, యువత ఈ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు




## అభివృద్ధి పనుల మంజూరు నా బాధ్యత

**. పనులు చేయించుకోవడం మీ బాధ్యత:**

**ధర్మసాగర్, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**



అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడం తన బాధ్యత కాగా, ఆ పనులను దగ్గరుండి చేయించుకోవడం ప్రజలు, స్థానిక నాయకుల బాధ్యత అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలంలోని ఎలుకుర్తి, రామన్నగడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్వాడి కాంపౌండ్ వాల్ ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.ఎలుకుర్తి సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రామన్నగూడెంకు ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు, సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, 10 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎలుకుర్తి నుంచి రామన్నగూడెం వరకు బీటీ రహదారిని ఆరు నెలల్లో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.ఎలుకుర్తి గ్రామానికి 20 ఇందిరమ్మ ఇండ్లు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, మహిళా కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు మంజూరు చేస్తానన్నారు. కరుణాపురం నుంచి సోమదేవరపల్లి వరకు డబుల్ రోడ్ వేయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డు ప్రదీప్ కుమార్, మండల అధ్యక్షుడు గుజ్జపు రాజేంద్రప్రసాద్,ఎలుకుర్తి ఉపసర్పంచ్ రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ,మండలనాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**ఏప్రిల్26(ప్రభాతవార్త)**

కాజిపేట్ మండల్తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆదివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ కడిపికొండ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి, కేఆర్.నాగరాజు హాజరై రిబ్బన్ కట్ చేసి గృహాల ప్రవేశమును ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులైన బుర్ర.సరిత, శ్రీనివాస్ దంపతులు, బుర్ర.కనకలక్ష్మి ్మ, నూతన ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశం నిర్వహించగా,ఎమ్మెల్యే నాగరాజు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయపేర్కొన్నారు..ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి నాయకత్వంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు గ్రామీణ పట్టణ పేదల జీవితాల్లో వెలుగులు,నింపుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. గృహం అనేది ప్రతి కుటుంబానికిభద్రత,గౌరవం,స్థిరత్వానికి ప్రతీక అని, అలాంటి స్వంతింటి కల నెరవేర్చడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు.కడిపికొండ ప్రాంత ప్రజలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులు కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నాగరాజుసూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు గంగుల.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు కర్ర. హరీష్ రెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షులు సాధనాథం గౌడ్, 44వ డివిజన్ అధ్యక్షులు రాజారపు.స్వామి, జక్కుల.సాధనాథం, కట్కూరి.రమేష్, బస్కె.ప్రణయ్, దువ్వ. శ్రీకాంత్, దువ్వ.నవీన్, దువ్వ.విజయ్, కరుణాకర్, కోటేశ్వర్, బుర్ర.మధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు స్వీయగణన నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**ఈ నెల 26 నుంచి మే10 వరకు నమోదు కు అవకాశం**

**స్వీయ గణన లో కుటుంబ సభ్యుల వివరాల నమోదు లో విద్య,ఉపాధి,నివాస పరిస్థితులు తప్పనిసరి**

**కుటుంబ వివరాల నమోదు ప్రక్రియ లో తప్పులు లేకుండా చూసుకోవాలి**

**విద్యావంతులు స్వీయ గణన ను భాధ్యతగా తీసుకోవాలి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్ సిటి ఏప్రిల్26 ప్రభాతవార్త



భారత జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు,ప్రింట్!!ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు టీపీటీ ద్వారా స్వీయ గణన విధానం,దాని ప్రాముఖ్యత పై విపులంగా వివరించారు. కలెక్టర్ మాట్లడుతూ జనాభా గణన 2027కు సంబంధించి మొదట ఇండ్ల గణన చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 26 నుంచి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ స్వీయ గణన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.ఈ విధానం ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం పెరగడమే కాకుండా పారదర్శకత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఇందుకుగాను మొదట https://se.census.gov.in లింకును ఓపెన్ చేసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ (హెచ్ఎల్ఓ) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, క్యాప్చా ఎంటర్ చేసి వెరిఫై,ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు.వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై,ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు.తరువాత వాళ్లకు నచ్చిన భాషను ఎంచుకోవచ్చున్నారు.వారి జిల్లా,పట్టణం/గ్రామం,పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని సూచించారు.తమ మొబైల్ లో లొకేషన్ ఆన్ చేసి,వారి ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాల్సి ఉంటుందన్నారు.ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ఈ ఐడి వస్తుందని చెప్పారు.దాన్ని స్క్రీన్ షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచాలన్నారు.మే 11 తర్వాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈఎస్ఈ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.స్వీయ గణనలో కుటుంబ సభ్యుల వివరాలు,విద్య,ఉపాధి, నివాస పరిస్థితులు వంటి అంశాలను సరిగ్గా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ సూచించారు.తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన డేటా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.అధికారులు ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,గ్రామ, వార్డు స్థాయిలో ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధులు కూడా స్వీయ గణనపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు.జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.సెన్సెస్ అవేర్నెస్ లో భాగంగా క్యాప్ లు పంపిణీ చేసి విస్తృతంగా అవేర్నెస్ తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంల అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిడి పుష్పలత, దుర్గరాజ్ సుభాష్ , జిల్లా అధికారులు, కలెక్టరేట్ స్టాఫ్ వివిధ శాఖల అధికారులు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలుస్తున్న బిల్ల రాధిక మహేష్ దంపతులు

గీసుగొండ ప్రభాతవార్త



గీసుగొండ మండలంలోని పెద్ద గ్రామమైన మచ్చాపూర్ కు చెందిన ఆశ కార్యకర్త ఖిబిల్ల రాధిక భర్త మహేష్“లు తమ వంతు సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. వీరు మచ్చాపూర్ గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో వినూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరు గ్రామంలో కిరాణం, కూరగాయల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు . సాధారణంగా వినియోగదారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను కోరడం సహజం అయితే వాటి వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని తమ వద్దకు వచ్చే వినియోగదారులకు ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా బట్టతో తయారుచేసిన సంచులను పంపిణీ చేస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ సొంత ఖర్చులతో గుడ్డ సంచులను తయారు చేయించి అందిస్తున్నారు. అలా చేయడమే కాక ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ కిరాణా సామానుకు, కూరగాయలను తీసుకోవడానికి వచ్చే వినియోగదారులకు క్లాత్ తో తయారైన సంచులు వెంట తెచ్చుకోవాలని చెప్పుతారు.ఈ సందర్భంగా రాధిక దంపతులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షి ంచుకోవడం అందరి బాధ్యత అని మా వంతు ప్రయత్నంగా మేము ఉచితంగా గుడ్డతో తయారైన సంచులను అందిస్తున్నామని తెలుపుతున్నారు. ఈ విధంగా అందరూ ప్రయత్నిస్తే మన గ్రామానికి ప్లాస్టిక్ రహిత గ్రామంగా పేరు వస్తుందన్నారు. డిపిఓ అభినందనలు : ఆశా కార్యకర్త రాధిక మహేష్ లు సమాజానికి ఉపయోగపడే వినూతన కార్యక్రమాన్ని చేపట్టినందుకు వీరికి జిల్లా పంచాయతీ అధికారి “కటకం కల్పన“ ఫోన్లో అభినందనలు తెలిపారు.

## లియాఫీ మీడియా పబ్లిసిటీ చైర్మన్ నియామకం

వరంగల్ సిటి ఏప్రిల్26 ప్రభాతవార్త



భారతీయ జీవిత బీమా ఏజెంట్లు సమాఖ్య (లియాఫీ)1964 వరంగల్ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.ఈ సమావేశంలో డివిజన్ కమిటీలో పలు కీలక పదవులకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు.డివిజన్ మీడియా అండ్ పబ్లిసిటీ చైర్మన్ గా ఖిలా వరంగల్ మండలం రంగశాయిపేటకు చెందిన ఆవునూరి కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ కార్యక్రమాలు,ఏజెంట్ల సమస్యలు,సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తారని ఈ సందర్భంగా నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం అతను మాట్లాడుతూ యూనియన్ బలోపేతం,ఏజెంట్ల హక్కుల సాధన,వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన డివిజన్ అధ్యక్షులు పులి సుధాకర్, రెసిడెంట్ సెక్రటరీ పబ్బా రాజా శ్రీనివాస్ ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇల్లంద లో ‘బడి బాట’

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త




వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో బుడగ జంగాల కాలనీలో ‘బడి బాట’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి పాల్గొని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పిల్లల వివరాలు, పత్రాలను పరిశీలించి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎం.ఈ.ఓ శ్రీధర్, తహశీల్దార్ విజయసాగర్, ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ సాంబయ్య, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ వదిలిన బాణమే కల్వకుంట్ల కవిత

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త



కేసీఆర్ వదిలిన బాణమే కల్వకుంట్ల కవిత అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. మక్క రైతులు కొనుగోలు కేంద్రాల్లో బారుదన్ (గన్ని బ్యాగులు) లేక ఇబ్బందుల ఏర్పడుతున్నాయని ,రైతులు ఎవరైన బారుదన్ తెచ్చుకుంటే వారికి కావలిసిన ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిధులు లేక కొంత ప్రభుత్వం ఇబ్బంది పడుతుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా గన్ని బ్యాగులు తక్షణమే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పరిణామాలపై కూడా ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై మాట్లాడుతూ, పదిహేనేళ్లుగా దోచుకున్న సొమ్మును ఎలా పంచుకోవాలనే విషయంలో వచ్చిన విభేదాల వల్లే బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి కొత్త పార్టీలు పెడుతున్నారని ఆయన విమర్శించారు. కవిత ఏర్పాటు చేసిన పార్టీ కూడా కేసీఆర్ వ్యూహంలో భాగమేనని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో ఇక బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఓ నీరజ, సొసైటీ ఇన్చార్జి కీరునాయక్, మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, కమిషనర్ జోనా, తహశీల్దార్ విజయసాగర్, వైస్ ఛైర్ పర్సన్ శిభారాణి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజీ రెడ్డి,పి.ఏ.సి.ఎస్ మాజీ ఛైర్మన్ రాజేష్ ఖన్నా,కౌన్సిలర్స్ పాపారావు,కమిలి ఖీమా నాయక్,తుమ్మల అరుణ,రమ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త



మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో 198990 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. చదువు పూర్తయి 35 వసంతాలు గడిచిన సందర్భంగా, వాట్సాప్ వేదికగా మిత్రులంతా ఏకమై ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ ఒకరోజు ముందుగానే గ్రామానికి చేరుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి, ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ వేడుకలో ఒకే బ్యాచ్‌కు చెందిన మాజీ సర్పంచ్ సుంకరి సాంబయ్య, ప్రస్తుత సర్పంచ్ బేతి సాంబయ్య పాల్గొనడం విశేషం. దశాబ్దాల తర్వాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం పట్ల అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్ఐ అడ్మిన్ రత్నం వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు వాసవి మాత త్యాగనిరతిని, ఆమె సందేశాన్ని కొనియాడారు. ఆమె మార్గం సమాజానికి ఆదర్శమని, ధర్మం, న్యాయం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన - 2027 స్వీయ గణనకు అవకాశం

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**



జనగణన - 2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్)ప్రక్రియకు నేటినుండి అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబవివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల26 నుండి మే 10వ తేదీవరకు స్వీయ గణన అందుబాటులో ఉంటుందని, ఈ కాలంలో ప్రజలు తమ ఇంటివివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, సౌకర్యాలు వంటి వివరాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చున్నారు. ఈసారి జనగణనలో తొలిసారిగా స్వీయ గణన విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, ఇది దేశాన్ని డిజిటల్ దిశగా తీసుకెళ్లే కీలక అడుగని పేర్కొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వీయ గణన నమోదు విధానాన్ని మీడియా ప్రతినిధులకు వివరించారు. స్వీయగణన ప్రక్రియలో మొబైల్ నంబర్, ఓటీపీ ఆధారంగా సురక్షితంగా నమోదు చేసుకోవచ్చని, నివాస స్థలాన్ని డిజిటల్‌మ్యాప్‌లో ఖచ్చితంగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలు పూర్తిగా నమోదు చేసిన అనంతరం ప్రత్యేక ఎస్ఈ ఐడీ అందుతుందని చెప్పారు. అలాగే, స్వీయ గణన చేసినప్పటికీ ఎన్యూమరేటర్ గృహ సందర్శన తప్పనిసరి అని, వారు ఎస్ఈ ఐడీ ఆధారంగా వివరాలను ధృవీకరించి తుది సమర్పణ చేస్తారని వివరించారు. స్వీయగణన చేయని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు స్వయంగా నమోదు చేస్తారని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ ఎం.రామరాజు స్వీయ గణన విధానంపై వివరించి, పోర్టల్‌లో లాగిన్ అయి ఓటీపీ ధృవీకరణ అనంతరం నివాస స్థలాన్ని మ్యాప్‌లో గుర్తించి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమర్పణ తర్వాత లభించే ఎస్ఈ ఐడీని భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రజలు తప్పకుండా స్వీయ గణనలో పాల్గొని ఖచ్చితమైన జనగణనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఓ చిన్న కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన పల్లె దవాఖానాల నిర్మాణం పనులు..!

**- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. వైద్యుల కొరతతో దెబ్బతింటున్న సేవలు**

**- గ్రామీణ ప్రజల ఆందోళన**

**బచ్చన్నపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**




గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన పల్లె దవాఖానా భవనాల నిర్మాణం పనులు బచ్చన్నపేట మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ఆలస్యమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో మొత్తం ఆరు పల్లెదవాఖానా భవనాల నిర్మాణానికి ఒక్కోటి రూ. 20లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ప్రతీభవనాన్ని సుమారు 1020 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు గదులు, స్టోర్‌రూమ్‌తో నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం రెండు భవనాల నిర్మాణమే సుమారు 80శాతం పూర్తికాగా, మిగతా నాలుగు భవనాలు ఇంకా నిర్మాణ దశకే చేరకపోవడం గమనార్హం.

**- మధ్యలోనే ఆగిన పనులు..:**

బచ్చన్నపేట మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఒక పల్లెదవాఖాన భవనం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మధ్యలోనే నిలిచిపోయింది. నెలల తరబడి పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పనులు సక్రమంగా సాగడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**-తాత్కాలిక భవనాల్లోనే వైద్యసేవలు..:**

పలు గ్రామాల్లో భవనాలు పూర్తి కాకపోవడంతో తాత్కాలిక ఏర్పాట్లలోనే వైద్యసేవలు కొనసాగుతున్నాయి. దీంతో రోగులకు అవసరమైన సౌకర్యాలు అందడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు గ్రామంలోనే వైద్యం పొందాలనే ఆశించినా, సమీప పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**- వైద్యుల కొరత తీవ్రం..:**

ఇక పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత మరింత సమస్యగా మారింది. నియామకాలు చేపట్టినా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి వైద్యులు ముందుకు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఏఎన్ఎంలతోనే దవాఖానాలు నడుస్తుండగా, ఎంబీబీఎస్ వైద్యులస్థానంలో మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమిస్తున్నారు. అయితే వారు కూడా వివిధ కారణాలతో ఉద్యోగాలు వీడడంవల్ల సేవలకు అంతరాయం కలుగుతున్నాయి. సాధారణ జ్వరం, జలుబు వంటి వ్యాధులకు మాత్రమే మందులు అందించగలుగుతున్న పరిస్థితి నెలకొనగా, ఇతర రోగులను జిల్లా లేదా ప్రాంతీయ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

**- ప్రజల డిమాండ్..:**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి తగిన వైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు గ్రామాల్లోనే వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

# రైతన్నకు తప్పని తిప్పలు..

**ధాన్యం కొనుగోలుచేసి వెంటనే మిల్లులకు తరలించాలి**

**- బీఆర్ఎస్ డిమాండ్**

**బచ్చన్నపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



ప్రస్తుతం ధాన్యంకొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నిజంగా ఆందోళనకరంగా ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలవద్ద రోజుల తరబడి నిరీక్షించాల్సి రావడం రైతులకు పెద్ద పరీక్షగా మారిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు కట్కూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కట్కూరు గ్రామంలో రైతులు మార్కెట్లో వరిధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలుగా పోసి కొనుగోలుకేంద్రాల వద్ద నెలరోజుల నుండి ఎదురుచూడడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటుచేసిన ఐకెపిసెంటర్ కొనుగోలు ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు రెండులారీల ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలించారన్నారు. ఇక మిగతా ధాన్యమంతా కూడా కుప్పలుగా పోసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వ అధికారులు కానీ ప్రభుత్వంగాని ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని, దిక్కుతోచని స్థితిలో రైతన్నల పరిస్థితి ఉందంటున్నారు. ఇంకో 29రోజులలో రోహిణి కార్తె రాబోతుందని, తిరిగి పంట విత్తుకోవలసిన సమయం ఆసన్నమవుతున్నా.. ఇంకా పండించిన పంట మార్కెట్లోనే ఉండడంవల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరగా చర్యలు తీసుకుని, పిఎసిఎస్, ఐకెపిసెంటర్ల ద్వారా ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోళ్లు చేసి రైస్ మిల్లులకు తరలించడానికి ప్రయత్నాలు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముసిని సునీత రాజుగౌడ్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముసిని శ్రీశైలంగౌడ్, వార్డు మెంబర్ అంజమ్మ రామచంద్రారెడ్డి, రెడ్డబోయిన విదేయ్‌కుమార్, పబ్బాల రాజు, ఏనుగుల శ్రీనివాస్, తుడుము సత్తయ్య, మరికింద బుచ్చయ్య, కోలబాను రమేష్, బండరాజు తుప్పతి, చేరియాలా సంపత్, బోయిన రాములు, గుడుగుల శ్రీధర్ మహిళలు పాల్గొన్నారు.

## జనగామ వార్త



### వైభవంగా కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



**జనగామ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

జనగామ జిల్లా కేంద్రంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు డా.గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు డా.మాదంశెట్టి వరూధిని పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సమాజంలో ఐక్యత, శాంతి నెలకొనాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బిజ్జల నవీన్ కుమార్, అరుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ, వనిత, వాసవి యూత్ రైసింగ్ స్టార్స్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో కూడా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా వాసవి వనిత యూత్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో పెద్ది కుసుమ అమ్మవారి చిత్రపటాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. వనిత క్లబ్ సభ్యురాళ్లు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

### కార్లకు షెడ్డుగా మారిన " పల్లె దవఖానా "..!!



**బచ్చన్నపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన పల్లె దవాఖాన ప్రాంగణం ప్రస్తుతం కార్ల పార్కింగ్ స్థలంగా మారిన ఘటన బచ్చన్నపేటలో నెలకొంది. బచ్చన్నపేట మండలకేంద్రంలోని బచ్చన్నపేట-1 పల్లె దవాఖాన నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా.. స్లాబువరకే పూర్తయిన నిర్మాణం పనులతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు దవాఖానా ప్రాంగణం ప్రస్తుతం కార్లకు పార్కింగ్ స్థలంగా మారిందనే విమర్శలు మిన్నంటుతున్నాయి. ప్రజల ఆరోగ్య అవసరాలకోసం నిర్మించిన భవనంలో కార్లే ఎక్కువగా కనిపిస్తున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### హనుమాన్ స్వాములకు ముస్లిం సోదరుల అన్నదానం

**లింగాలఘణపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



జిల్లాలో మతసామరస్యాన్ని చాటిచెప్పే సంఘటన చోటుచేసుకుంది. లింగాలఘనపూర్ మండలం వడిచర్ల గ్రామంలో హనుమాన్ ఊరేగింపు ముగిసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో హనుమాన్ మాలధారణ స్వాములకు ప్రత్యేక అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ముస్లింసోదరులు ముందుకు వచ్చి స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. ఎస్‌డి మేజా, అజ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వాములకు భోజన వసతులు కల్పించారు. ఈ కార్యక్రమం మతాల మధ్య ఐక్యతను ప్రతిబింబిస్తుందని స్థానికులు అభినందించారు. స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాకతీయ కలల జాతరను జయప్రదం చేయండి

నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



ఒరుగల్లు కళాశికరాల జిల్లా అధ్యక్షులు మే 8, 9, 10వ తేదిల్లో వరంగల్‌లో జరగబోయే కాకతీయ కలల జాతరను జయప్రదం చేయాలని ఆదివారం నర్సంపేట పట్టణంలో తాళ్ల సునీల్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒరుగల్లు కళాశికరాల జిల్లా అధ్యక్షులు జూపాక శివ పాల్గొని మాట్లాడుతూ కాకతీయుల నాటి కళావైభవాన్ని మరోమారు ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో జానపద కలలకు పుట్టినిల్లు అయిన పోరుగల్లు ఒరుగల్లు జానపదాన్ని ఈ తరానికి పరిచయం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ మహత్తర కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని కళాబలగమంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సాంస్కృతిక ఉత్సవాళ్ళో ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారులూ అందరు పాల్గొనీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డాన్స్ అకాడమీలకు, గుస్సాడి, జానపద నృత్య బృందాలకు, ఒగ్గు డోలు బృందాలకు, జానపద సినీ గాయకులకు ఈ సమాచారాన్ని చేర వేయాలని పిలుపునిచ్చారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా జానపద సాంగ్స్ జానపద డాన్సులు ఒగ్గు కథ వంటి కళారూపాలకు ప్రైజ్ మనీ సైతం ఇచ్చుకుంటూ కళలను ప్రోత్సహించే విధంగా నేటి తరానికి కలలను పరిచయం చేసే విధంగా ఈ యొక్క కార్యక్రమాన్ని గొప్పగా చేయడం జరుగుతుందని ప్రతి ఒక్క కళాకారులు ఈ కార్యక్రమాన్ని తమ భుజాలపై వేసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఇన్చార్జిలు రామంచ సుమన్, తాళ్ల సునీల్, నెల్లుట్ల సుమన్, నర్సంపేట సీనియర్ కళాకారులు తాళ్లపెల్లి చంద్రమోళి, శాతరాశి సురేష్, కళాకారులు పడిదం రాజేందర్, హన్మకొండ బిక్షపతి, డప్పు నరేష్, కందకట్ల రామకృష్ణ, ఉప్పరపల్లి రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



పట్టణంలోని మల్లంపల్లి ఎస్‌బిఐ బ్యాంకు ఎదురుగా నూతనంగా నిర్వహించిన మహీరా కేఫ్ అండ్ టిఫిన్ సెంటర్‌ను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సందర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శిరంశెట్టి రాకేష్-జీవనలకు శుభాకాంక్షలు తెలియపేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెండెం లక్ష్మీరామానంద్, పట్టణ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్స్ బీరం భరత్‌రెడ్డి, ముత్తినేని వెంకన్న, ఎలకంటి విజయ్‌కుమార్, శ్రీరామోజు రోజారాణి, పొన్నాల మనీషా ప్రకాష్ పాల్గొన్నారు.

# మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

నెక్కొండ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని పంచాయతీ రాజ్‌శాఖ ట్రిబ్యునల్ మెంబర్ గటికి అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పనికర గ్రామానికి చెందిన గుట్ట వద్ద మొక్కజొన్న రైతుల క్షేత్రాలను సందర్శించి ఆయన మాట్లాడుతూ ముందుచూపు లేని రాష్ట్ర ప్రభుత్వం మక్కజొన్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. గోదాముల నిల్వ సామర్థం, ముందస్తు ప్రణాళికలపై స్పష్టత లేకుండా రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడు చేతులు ఎత్తేసి చూస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం రైతులకు నష్టం కలగకుండా అలంకానిపేట, దీక్షకుంట్ల, చంద్రుగొండ, ముదిగొండ ప్రాంతాల్లో మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం నెక్కొండ మార్కెట్‌లో కాంటాలు జరగకపోవడంతో ధాన్యం పేరుకుపోయిందని తెలిపారు. పనికర నుంచి నెక్కొండ రైల్వే స్టేషన్ వరకు, గూడూరు అడ్డరోడ్డు నుంచి సూరిపల్లి వరకు మక్కజొన్నతో నిండిన ట్రాక్టర్లు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ క్లియర్ చేయాలనే పేరుతో రైతుల ట్రాక్టర్లను బలవంతంగా పనికర గుట్ట పక్కన ఉన్న గుంతల మయం అయిన భూమిలో మక్కజొన్న దింపించడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ సర్పంచ్ బొల్లెబోయిన విరస్వామి, మాజీ ఉపసర్పంచ్ దేవానబోయిన విరభద్రం, బక్కి కుమారస్వామి, ఈదునూరి వెంకన్న, దుగ్యాల శ్రీనివాస్, చిలుపూరి వెంకన్న, చిలుపూరి ప్రశాంత్, తిప్పని సుభాష్, చెట్టబోయిన అభి, ధనుంజయ్, వీరన్న రైతులు పాల్గొన్నారు.

## పొదుపు చేయడం అలవర్చుకోవాలి



దుగ్గొండి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

ఒక నెలలో సంపాదించిన సంపాదనను ఒకరోజు పిదుపు చేసుకుంటే వృద్ధాప్యంలో ఆనందంగా జీవించవచ్చునని పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు అనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మంపేట చైతన్య పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల అనారోగ్యంతో చుక్క కోటి మృతిచెందారు. మృతుడి భార్య చుక్క సరితకు 83890 రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పురుషుల సంఘంలో సభ్యత్వం పొంది తక్కువ వడ్డీతో రుణాలను పొందాలన్నారు. ప్రైవేటు వ్యాపారస్తులకు వెళ్లి ఇబ్బందులు పడకుండా దగ్గరలో ఉన్న పొదుపు సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘంలో సభ్యత్వం పొంది బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరం చంద్రమోహన్‌రెడ్డి, విగ్నేశ్వర్, ఈదుల గణపతి, రాజేందర్, సౌడారపు కొమురెల్లి నల్లగొండ కోటి, రఘు, ఎస్కే షరీఫ్, కుమారస్వామి, గణకులు దండు కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న లింగమూర్తి



నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

డిజిటల్ మీడియా, జర్నలిజం రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన వరంగల్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ రాంపెల్లి లింగమూర్తికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన పద్మ శ్రీ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు 2026 ప్రదానం చేశారు. జివ్రాన్ ఫౌండేషన్, ప్రయాగరాజ్(ఉత్తరప్రదేశ్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డు కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు గౌరవ సూచకంగా ఈ అవార్డులు అందజేశారు. రాంపెల్లి లింగమూర్తి మీడియా రంగంలో చేసిన విశేష కృషి, ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, నిష్పక్షపాత ధోరణితో వార్తలను ప్రజల ముందుకు తీసుకురావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు లభించిన సందర్భంగా స్నేహితులు, సహచర జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తికి ఇలాంటి జాతీయ స్థాయి గౌరవం రావడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా ఉందని పలువురు కొనియాడారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



నర్సంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

పట్టణంలోని సర్వపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు మాజీ గ్రంథాల సంస్థ డైరెక్టర్ పుట్టపాక కుమారస్వామి ఇటివలే గుండె పోటుతో మరణించగా వారి చిత్రపటానికి నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు, నల్లబెల్లి మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సిద్దార్థ గురుకులంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చెన్నారావుపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



మండల కేంద్రం చెన్నారావుపేటలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇదే గురుకులంలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాఠశాలలో చదివిన నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. వీరంతా ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడినప్పటికి ఒకే చోట కలుసుకోవడంతో వారంతా ఎంతో సందడి చేశారు. అలాగే నాడు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను ఆత్మీయంగా స్వాగతించి వేదికపై వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కందిగోపాల్‌రెడ్డి, నాటి ప్రధానోపాధ్యాయులు మోతె ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు రామస్వామి, శ్రీనివాస్, యాకుబ్, రాములు, అజయ్, భారతి, సుధాకర్, యాకాంబ్రం, సూరయ్య, లక్ష్మణ్, సృజన, వీరభద్రయ్య, కుమారస్వామి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన మొక్క జొన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

**మొగుళ్లపల్లి, ప్రభాత వార్త,ఏప్రిల్ 26:**

మండలంలోని గణేష్ పల్లి, పెదకోమటిపల్లి శివారులో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన మొక్క జొన్న పంటలను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ఆదివారం మొక్కజొన్న పంట చేనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణేష్ పల్లి, పెద్దకోమటిపల్లి గ్రామంలోని 17 మంది రైతుల 30 ఎకరాల మొక్కజొన్న పంట చేనులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ దగ్ధమైనవి.గత సంవత్సరం కూడా ట్రాన్స్ ఫార్మర్ సరిగా నిర్వహణ లేకపోవడం వల్ల ఇలాంటి అగ్నిప్రమాదం జరిగి రైతులు నష్టపోయారని తెలిపారు. విద్యుత్ శాఖకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, సమస్యను పూర్తిగా పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు మూడు సంవత్సరాలుగా ఈ తరహా



సంఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. ఈ ట్రాన్స ఫార్మర్ సమస్యపై నిన్న మధ్యాహ్నం గణేష్ పల్లి సర్పంచ్ సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. సీఎండీ వరుణ్ రెడ్డితో మాట్లాడగా, వెంటనే సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కూడా మాట్లాడినట్లు తెలిపారు. కలెక్టర్ స్వయంగా ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలిస్తారని, వ్యవసాయ శాఖ అధికారులు కూడా పంట నష్టాన్ని అంచనా వేసి రైతుల వివరాలు నమోదు చేస్తారని వెల్లడించారు. దగ్ధమైన మొక్కజొన్న కంకులను కొనుగోలు చేసే అంశంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కూడా మాట్లాడారు. వీలైనంత వరకు రైతులకు నష్టం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారని, జిల్లా కలెక్టర్ కూడా వచ్చి పరిశీలన చేసిన అనంతరం తక్షణమే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనలో నోటికి వచ్చిన పంట నష్టపోవడం చాలా బాధాకరమని, రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

# ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

**రేగొండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన కొత్తపల్లిగోరి మండల పరిధిలోని పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారిపై చలివాగు వద్ద జరిగింది.రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన సుంకరి రవీందర్ (45) ఆదివారం పరకాలలో బంధువుల పెళ్లి ఉండగా ద్విచక్ర వాహనంపై వెళ్ళాడు. పెళ్లికి హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా చలివాగు వద్ద భూపాలపల్లి నుండి పరకాలకు వెళ్తున్న బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవీందర్ కు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రామ, కుమారుడు అజయ్,కూతురు వర్షిణి ఉన్నారు..భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి గోరీ ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాటారం ఉపసర్పంచ్ బానయ్య

**కాటారం, ఏప్రిల్ 26, ప్రభుతావార్త**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం ఒక వివాహ వేడుక అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ జరిగింది. కాటారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అజ్మీర కిషన్ నాయక్ కుమారుడు శ్రీకాంత్ నాయక్ వివాహ వేడుక జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ శుభకార్యానికి కాటారం ఉపసర్పంచ్ కొండ గొర్ల బానయ్య హాజరయ్యారు. ఆయనతో పాటు స్థానిక వార్డు సభ్యులు కూడా తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బానయ్య మాట్లాడుతూ.. కొత్తగా వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న శ్రీకాంత్ నాయక్ దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు.రాజకీయ ప్రముఖులతో పాటు సామాజిక రంగాలకు చెందిన వారు కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. నేతకాని సేవ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గంట దేవదాస్ నూతన దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బంధుమిత్రుల సందడి, సాంప్రదాయ కార్యక్రమాలతో కల్యాణ మంటపం కళకళలాడింది.పెద్ద సంఖ్యలో హాజరైన అతిథులు, కుటుంబ సభ్యులు వధూవరులకు తమ మంగళాశాసనాలు అందజేస్తూ, వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగాలని కోరుకున్నారు.

# ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

**గణపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి.. ఆదేశానుసారం ఈరోజు భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో శ్రీ వాసవి మాత జయంతి నిర్వహించడం జరిగింది అందులో భాగంగా గణపురం మండల కేంద్రానికి చెందిన వైశ్య సంఘం నాయకులు, రంగు జగదీశ్వర్, కట్కూరు శ్రీనివాస్, కొండూరి ముక్తేశ్వర్, శ్రీరాముల శ్రీనివాస్, దేసు ప్రదీప్. శ్రీరాముల గోపి నాథ్, శ్రీరాముల సంపత్, బుక్క శీను, భూపతి శ్రీను, అనుగం నరహరి, దేశ నవీన్ తదితరులు పాల్గొన్నారు



# ప్రజల దాహార్తి తీర్చేందుకే బోరు ఏర్పాటు

**గణపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



గణపురం వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి దాహార్తి తీర్చేందుకే బోర్లకు మోటార్లు బిగించినట్లు చెల్పూర్ సర్పంచ్ కావటి రజిత రవీందర్ అన్నారు. ఆదివారం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ 3వ వార్డులో లో నీటి సమస్య ఉందని తెలుసుకొని 3వ వార్డు లో బోర్ మోటార్ దింపి స్విచ్ ఆన్ చెయ్యడం జరిగింది. ఉప సర్పంచ్ పొనగంటి మలహాల్ రావు, వార్డు మెంబర్లు గండ్రత్ రవీందర్, అల్లూరి సారయ్య. నారమళ్ళ పావని, బోడ రాజేందర్, ఎండీ అంజాద్ పాషా, కొండి కుమార స్వామి ,అడ్డురి శ్రీధర్ రావు,సీసీ ఎండీ ఇమామ్, అయూబ్ ఖాన్ ధారకొండ నాగారాజు, ధారకొండ శంకర్, చెన్నూరి సమ్మయ్య, కారోబార్ వేణు, గ్రామపంచాయితీ సిబ్బంది కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# జీనెక్స్ సీడ్స్ ఆద్వర్యంలో రాజా దొడ్డు రకంపై క్షేత్ర ప్రదర్శన

**కాటారం, ఏప్రిల్ 26, ప్రభుతావార్త**



కాటారం మండల కేంద్రంలోని సూరం సమ్మి రెడ్డి రైతు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం జీనెక్స్ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో రాజా దొడ్డు రకం పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులు పెద్ద ఎత్తున వచ్చి సందర్శించి మేలైన అధిక దిగుబడినిచ్చే రకం అని తెలిపారు. ఈ రకంలో అధిక పిలకలు, అధిక కంకి, మొక్క బలంగా ఉండటం వల్ల రోగాలను తట్టుకొని గాలి, వానలకి పడిపోకుండా అధిక దిగుబడినిస్తుందని ఈ రకం గింజ అధిక బరువు వచ్చే గుణం వుంది మొక్క మధ్యస్థ ఎత్తు పెరుగును అని కంపెనీ ప్రతినిధి రాజశేఖర్ వివరించారు. కంపెనీ ప్రతినిధులు ఏఎస్ఎమ్ రాజశేఖర్, డిస్ట్రిబ్యూటర్ క్రాంతికుమార్ ట్రేడర్స్,గట్టు రమేష్ సిబ్బంది శ్రీనివాస్ పలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# తాడిచెర్లలో ఘనంగా వాసవిమాత జయంతి వేడుకలు

**మల్హర్ రావు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన తాడిచెర్లలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతి వేడుకలను స్థానిక చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. వాసవి మాత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే గ్రామంలో జయంతి సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముందు వాసవి మాత చిత్రపటానికి తాడిచెర్ల లోని వెంకటేశ్వర ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా వైశ్య సంఘం మండల అధ్యక్షుడు కుక్కుడపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు గారికి , రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ సుజాత గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైశ్య సంఘం సభ్యులు వొళ్ళాల వరప్రసాద్, కుక్కుడపు అశోక్, రేపాల హరీష్ కుమార్, రమేష్, భాస్కర్, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

# ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

**రేగొండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



మండలం రంగయ్యపల్లి గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 333వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆలయంలో వేద పండితుల చేత ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఈ మహోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి ఆలయ అభివృద్ధికి చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు చేపడతామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు, అర్చకులు శృంగారపు వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో శృంగారపు బిక్షపతి, విష్ణుమూర్తి, గురుమూర్తి, వేణు,సానుగోజు రమేష్, దేవేందర్, రామ్మూర్తి, రాజేష్, వడ్లూరి సమ్మయ్య, కాజుబోజు సూర్యప్రకాష్, అంజి, సంతోష్, భారత్, రవీందర్, పవన్,తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా కేంద్రంలో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

**భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

శ్రీ వాసవి మాత జయంతి వేడుకలు పట్టణంలోని ఆర్యవైశ్య వాసవి మాత ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా పట్టణ ఆర్యవైశ్యులు జరిపారు.. ఈ కార్యక్రమం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అనంతరం కుంకుమ పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పట్టణ ఆర్యవైశ్యులు జరిపారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ , కౌన్సిలర్లు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు శిరుప అనిల్ , పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు..



# అశోక్ ను పార్టీ నుండి బహిష్కరిస్తున్నాం

**సిపిఐ(ఎంఎల్)**

**న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ**

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 26



సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సమావేశం కామ్రేడ్ ఎం.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.రాష్ట్ర కమిటీ సభ్యులలో మొత్తం 9 మందిలో ఒకరు సమావేశానికి హాజరు కాలేదు.మిగిలిన ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులలో ఆదివారం ఐదుగురు మెజార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర కార్యదర్శి అశోక్ పార్టీ నిర్మాణం నిబంధనలకు వ్యతిరేకంగా కమిటీలో ఎలాంటి చర్చ, నిర్ణయం లేకుండా కే.అనంత రెడ్డి,ఎస్కే. మదార్,బి.రాంసింగ్ లను అర్థం,పర్థం లేని ఆరోపణలతో పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది.దాన్ని తీవ్రంగా పరిగణిస్తూ సమావేశం సుదీర్ఘంగా చర్చించి రాష్ట్ర కార్యదర్శి పదవి నుండి,పార్టీ నుండి అశోక్ ను బహిష్కరిస్తున్నాట్లు వారు తెలిపారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా గత ఆరు నెలలుగా పార్టీ నిర్మాణాన్ని,నిబంధనలని లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడలతో,వ్యక్తిగత నిర్ణయాలతో పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాట్లు తెలిపారు.పార్టీని కాంగ్రెస్ పార్టీకి అనుచర వర్గంగా తయారు చేయడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు.. గత పంచాయతీ ఎన్నికలలో తను నివాసం ఉంటున్న గ్రామం గురిమెళ్ళ (పార్టీ సెంటర్)లో కాంగ్రెస్ తో మంతనాలాడి కాంగ్రెస్ తో ఎన్నికల పొత్తు పెట్టుకున్నాడు ఆధారాల్లేని ఆరోపణలతో పార్టీని భ్రష్టు పట్టించే చర్యలకు అశోక్ దిగినందుకు ఈయన పార్టీకి విద్రోహం తలపెట్టినందున అశోక్ ను రాష్ట్ర కార్యదర్శి పదవి నుండి,పార్టీ నుండీ మెజార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుల అశోక్ ను బహిష్కరిస్తున్నామని మీడియాకు తెలిపారు.పార్టీ కార్యకర్తలు, శ్రేణులు ఎలాంటి గందరగోళానికి గురికావద్దని,అశోక్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను, మోసపూరిత మాటలను నమ్మవద్దని తెలియజేస్తు న్నామన్నారు.

మహబూబాబాద్ వార్త
మహబూబాబాద్, తొర్రూరు

## కొత్తగూడెం గ్రామ శివారులో మొక్కజొన్న చేను దగ్ధం విద్యుత్ ప్రమాదం కాదు

**విద్యుత్ శాఖ డిఈ కోటేశ్వరరావు**

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 26.



బయ్యారం మండలం కొత్తపేట సెక్షన్ కొత్తగూడెం లింగగిరి గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో మొక్కజొన్న చెనుల్లో జరిగిన అగ్ని ప్రమాదం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వల్ల జరిగిందని కొన్ని పత్రికలు తప్పుడు వార్తలు ప్రచురించాయి.ఈ ప్రమాద ఘటనను పరిశీలించడానికి టీజీఎంపిడిసిఎల్ విద్యుత్ శాఖ డిఈ కోటేశ్వరరావు వారి సిబ్బంది సంఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు.మొక్కజొన్న చెనుల్లో మంటలు సంబవించిన ఆ సమయంలో ఆ ప్రాంతంలో రైతుల వ్యవసాయ క్షేత్రలకు విద్యుత్ నిలిపివేయడం జరిగిందని,అందువల్ల విద్యుత్ లైన్లు,విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వల్ల ఎటువంటి మంటలు చెలరేగలేదని,విద్యుత్ ప్రమాదం వల్ల ఈ ఘటన జరగలేదని,ప్రమాదవశాత్తు మంటలు ఏర్పడి ఉండవచ్చు అని విద్యుత్ అధికారుల ఎంక్వయిరీలో తేలినట్లు వారు తెలిపారు.కొందరు కావాలని విద్యుత్ శాఖపై లేనిపోని తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదని అన్నారు. ఎడిఈ రమేష్,ఎఈ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## వలస నాయకులతో ఇబ్బంది పడుతున్నామని సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 26.



తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కలిశారు.బయ్యారం మండలంలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న వివక్ష ను సీతక్కకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో పని చేసిన వారిని ఇబ్బందులకి గురిచేస్తూ పొమ్మనకుండా పొగపెడుతున్నారన్నారు.పార్టీలో ఒక్కరిద్దరు వ్యక్తుల వల్ల పార్టీ కోసం కష్టపడ్డ మేమంతా ఇబ్బందులు పడుతున్నామన్నారు.పార్టీ అధికారంలోకి రావాలని కష్టపడ్డ మేమంత తీరా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వలస వాదులు పార్టీలో చేరి నిజమైన కాంగ్రెస్ నాయకులను పురుగుల్లా చూస్తున్నారని,అడుగుగునా అవమానాలు, అవహేళనలకు గురి చేస్తున్నారు అని,కాంగ్రెస్ పార్టీని దశబ్దకాలం నమ్ముకున్న పాపానికి మాకు ఇచ్చే బహుమానం ఇదేనా అని సీతక్క దగ్గర నాయకులు వాపోయారు.దీనిపై స్పందించిన సీతక్క మీ జిల్లా ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకొని వెలుతానని మీరు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మాజీ ఎంపీపీ,మాజీ రాష్ట్ర టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ కిషన్ నాయక్,నాయిని శ్రీనివాస్ రెడ్డి, నందగిరి భద్రయ్య,కాచనపల్లి గ్రామశాఖ అధ్యక్షులు పస్తం రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- ఆర్థికంగా అండగా ప్రభుత్వం**

మరిపెడ, ఏప్రిల్ 26:(ప్రభాత వార్త);



మరిపెడ మున్సిపల్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను మున్సిపల్ ఛైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఈ సహాయం వారికి ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.లబ్ధిదారులు కూడా ఈ సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైన సమయంలో ఇలాంటి సహాయం అందించడం ద్వారా ప్రజల జీవనోపాధికి బలమవుతోందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ మాండన్ కాంతమ్మ కరణ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మహేందర్ పాల్గొని, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిబద్ధత కలిగిన ఆదర్శ నాయకుడు నరసింహారావు

**సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి**

గార్ల, ఏప్రిల్26 ప్రభాతవార్త:



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మహబూబాబాద్ జిల్లా నాయకులు, నిబద్ధత కలిగిన పోరాట యోధుడు, ఆదర్శ నాయకులు పోతుల నరసింహారావు ఆయన మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. విజయ్ సారథి అన్నారు. ఆదివారం గార్ల మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న అధ్యక్షతన పోతుల నరసింహారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ సారథి మాట్లాడుతూ, నరసింహారావు గారు నిజాయితీకి, క్రమశిక్షణకు మారుపేరని కొనియాడారు. చివరి శ్వాస వరకు ఎర్రజెండాను వీడకుండా, ప్రజల పక్షాన నిలబడి పోరాట మార్గంలో సాగిన ఆయన జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తపించిన మంచి మనసున్న నాయకుడని కీర్తించారు. అనంతరం ఘనంగా నివాళులర్పించారు. ఈ సంస్మరణ సభలో పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మండా రాము గౌడ్, సిపిఐ సీనియర్ నాయకులు కట్టెబోయిన బిక్షం, పల్లె పోయిన లింగయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గార్ల మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ సక్రు, ప్రముఖులు వజ్రం నాగేశ్వరరావు, పోతుల నరసింహారావు కుటుంబ సభ్యులు పోతుల బుజ్జి బాబు, పిడమర్తి ప్రసాద్, రాగం రమేష్, ధూపాటి జనార్ధన్, ధారావత్ వీరన్న, రాగం సత్యనారాయణ, కట్టెబోయిన పిచ్చయ్య, పొన్నం వెంకన్న తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మిత్రులు, తదితరులున్నారు.

## మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో జనాభా లెక్కల స్వీయ గణన ఆరంభం

మరిపెడ, ఏప్రిల్ 26 (ప్రభాత వార్త):




మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో "భారత జనగణన 2027 - తెలంగాణలో జనాభా లెక్కలు" స్వీయ గణన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్టణ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనగణన ప్రతి పౌరునికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ఖచ్చితమైన జనాభా లెక్కలు అవసరమని తెలిపారు. స్వీయ గణన విధానం ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, సమగ్ర సమాచార సేకరణకు ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి కుటుంబం చురుకుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. అధికారులు అందిస్తున్న మార్గదర్శకాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మెరుగు రాము, మాండన్ కాంతమ్మ కరణ్ సింగ్, గుగులోత్ నీలా లచ్చిరాం, తిరుపతి, జియో రమేష్, పానుగోతు రాములు, బేబీ రవి పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.జనగణన 2027 స్వీయ గణన కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో మరింత సమర్థవంతంగా అమలై, భవిష్యత్ ప్రణాళికలకు బలమైన పునాది వేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరిని యువత ఆదర్శంగా తీసుకోవాలి...

**మహనీయుల ఉత్సవ కమిటీ ఛైర్మన్ జనగామ కరుణాకర్ రావు**

కాటారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

కాటారం మండల కేంద్రంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా కాటారం మండల కేంద్రంలో మహనీయుల ఉత్సవ కమిటీతో పాటు స్థానికులు భక్తిపూర్వకంగా జ్ఞాపకార్థం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు అర్పించి, మాత త్యాగ గాథను స్మరించారు.మహనీయుల ఉత్సవ కమిటీ ఛైర్మన్ జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ..శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జీవితం మొత్తం ధర్మం, అహింస, త్యాగాల ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆయన వివరించిన విధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగొండ అనే



గ్రామంలో కుసుమశ్రేష్ఠి అనే మంచి వ్యాపారి, అతని భార్య కుసుమాంబతో కలిసి జీవించేవారు. చాలా కాలం తర్వాత వారికి ఒక కుమార్తె జన్మించింది, ఆమే వాసవి.చిన్నప్పటి నుంచే తెలివైన, గుణవతి అయిన వాసవి అందరికీ సహాయం చేస్తూ, ధర్మం పాటిస్తూ పెరిగిందని ఆయన చెప్పారు. అహింస పట్ల ఆమెకు ఎంతో ప్రేమ ఉండేదని, ఎవరికీ హాని జరగకూడదని ఆమె ఎప్పుడూ ఆలోచించేదని వివరించారు. ఒక రోజు ఒక రాజు ఆమెను చూసి పెళ్లి చేసుకోవాలని కోరుకున్నాడు. కానీ వాసవికి ఆ వివాహం ఇష్టం లేకపోయింది.అయినప్పటికీ, రాజు బలవంతంగా పెళ్లి చేసుకోవాలని పట్టు పట్టడంతో యుద్ధం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో వాసవి చాలా గొప్ప త్యాగం చేసింది. తన వల్ల ఎవరి జీవితాలు నాశనం కాకూడదనే భావనతో ఆమె అనేక మందితో కలిసి అగ్నిలో ప్రవేశించింది. ఆ త్యాగం చూసి అందరూ ఆశ్చర్యపోయారు మరియు ఆమెను దేవతగా పూజించడం ప్రారంభించారు.ఈ బహిరంగ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పంతకాని సమ్మయ్య, బిసుల నర్సయ్య పవిత్రం శ్రీనివాస్, మద్ది నవీన్, అనంతల శ్రీనివాస్, దారం నాగేష్, కలికోట శ్రీనివాస్, ఏ ఎల్ ఎన్ మూర్తి, కమటుల రవీందర్, దారం నందకిషోర్, ముక్క శ్రీనివాస్, దారం వెంకటేశ్వర్లు, భీమారపు రాజబాబు, అల్లరి శ్రీనివాస్, బుర్రరాజు, దుర్గం తిరుపతి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, ఆత్మకూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సమావేశం...

**డాక్టర్ వీరమనేని సంపత్ రావుకు హ్యూమన్ రైట్స్ లీడర్షిప్ అవార్డు ప్రదానం...**

**మార్గదర్శి హైస్కూల్‌లో మానవ హక్కుల పరిరక్షణపై చర్చ..**

భూపాలపల్లి టౌన్ , ఏప్రిల్ 26, ప్రభుతావార్త

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మార్గదర్శి హైస్కూల్‌లో ఆదివారం నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. హ్యూమన్ రైట్స్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు తిరి అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు జ్యోతిష్య రెడ్డి, నేషనల్ ఉమెన్ రైట్స్ యాంటీ కరప్షన్ అధ్యక్షులు డాక్టర్ వీరమనేని సంపత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా సమాజంలో మానవ హక్కుల ఆవశ్యకత, పౌరుల హక్కుల పరిరక్షణలో కమిటీ పోషించాల్సిన పాత్రపై నేతలు చర్చించారు. మానవ హక్కుల ఉల్లంఘనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సామాజిక సేవలో అంకితభావంతో పనిచేస్తున్న డాక్టర్ వీరమనేని సంపత్ రావు సేవలను గుర్తించి, జాతీయ అధ్యక్షులు జ్యోతిష్య రెడ్డి ఆయనకు హ్యూమన్ రైట్స్ లీడర్షిప్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ రావుకు మెమెంటో మరియు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు ప్రేమలతతో పాటు జిల్లా కమిటీలోని వివిధ విభాగాల సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఘనంగా మేడే వేడుకలు నిర్వహించాలి

**మాజీ సర్పంచ్ రాంలాల్ పిలుపు**

మరిపెడ, ఏప్రిల్ 26:(ప్రభాత వార్త);

ప్రపంచ కార్మికుల ఐక్యత, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే మే డే వేడుకలను ఘనంగా, జయప్రదంగా నిర్వహించాలని కార్మికుల పక్షపాతి, మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్ పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మే డే అనేది కేవలం పండుగ మాత్రమే కాకుండా ప్రపంచ కార్మికుల ఐక్యతను ప్రతిబింబించే ముఖ్యమైన దినమని పేర్కొన్నారు. కార్మికులు తమ చెమట చుక్కలు, శ్రమతో సమాజ అభివృద్ధికి పునాది వేస్తున్నారని, వారి కష్టానికి గౌరవ సూచకంగా జరుపుకునే దినోత్సవమే మే డే అని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉన్నప్పుడే తమ హక్కులను సాధించ గలరని, ఈ సందేశాన్ని సమాజానికి



చాటేలా వేడుకలను నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.మే 1న మరిపెడ పట్టణ కేంద్రంలో జెండా ఆవిష్కరణ, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచి కార్మికుల ఐక్యతను చాటాలని సూచించారు. గత పోరాటాలను స్మరించుకుంటూ భవిష్యత్ ఉద్యమాలకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాంలాల్ కోరారు.

## మరిపెడలో డీజిల్ కొరతపై సీపీఐ ఆందోళ

మరిపెడ, ఏప్రిల్ 26:(ప్రభాత వార్త);

మరిపెడ మండల కేంద్రంలో కొనసాగుతున్న డీజిల్ కొరతపై సీపీఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక పెట్రోల్ బంకుల్లో డీజిల్ అందుబాటులో లేక ప్రజలు, రైతులు, వాహనదారులు గంటల తరబడి వేచి చూడాల్సి న పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది.డీజిల్ కొరత కారణంగా ట్రాక్టర్లు, ఆటోలు నిలిచిపోతుండగా వ్యవసాయ పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని సీపీఐ నాయకులు తెలిపారు. సాగు పనులకు అవసరమైన యంత్రాలను వినియోగించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ కొరత రైతాంగాన్ని మరింత నష్టాల్లోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక రవాణా రంగంపైనా ఈ సమస్య ప్రభావం చూపుతోంది. సరుకు రవాణా ఆలస్యమవడంతో




వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రయాణాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించకపోతే ప్రజా జీవనం మరింత అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి నాయకుడు ఎం.డి. అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మరిపెడ బంకుల్లో తగినంత డీజిల్ నిల్వలు అందుబాటులో ఉంచాలని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

## రాయపర్తి మండలం శుభకార్యాలలో పాల్గొన్న ఝాన్సీ రాజేందర్ రెడ్డి

రాయపర్తి ప్రభాతవార్త ఏప్రిల్ 26

రాయపర్తి మండలంలోని పేరికవేడు గ్రామంలో నూతన గృహప్రవేశం వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.వల్లెపు అనిత–యాదగిరి మరియు దుంరెట్టి లక్ష్మి క్ర–యాకయ్య దంపతుల నూతన గృహప్రవేశం సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారికి పట్టువస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షి స్తూ ఆశీర్వదించారు.అనంతరం అదే గ్రామంలోని



గుంటూరువల్లి చిన్నారుల పంచెకట్టు వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో బ్లాక్ మరియు మండల అధ్యక్షులు, స్థానిక సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




## చిన్నముప్పారంలో వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

**స్వామివారి బోధనలు ఆచరణీయం: సర్పంచ్ రాయిలి భవానీ శేఖర్**

ఇనుగుర్తి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:

ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి 333వ ఆరాధన (జీవ సమాధి) మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల రాకతో



చిన్నముప్పారం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ ఆరాధనోత్సవాల్లో గ్రామ సర్పంచ్ రాయలి భవానీ శేఖర్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి బోధనలను స్మరించుకుంటూ, ఆయన జీవ సమాధి మహోత్సవాన్ని మన గ్రామంలో జరుపుకోవడం మనందరి అదృష్టం. సమాజం కోసం ఆయన చేసిన ఉపదేశాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయం అని పేర్కొన్నారు. భక్తుల కోసం నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను ఆయన అభినందించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బాలకృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాము నుంచే విశేష అభిషేకాలు, పంచామృత స్నానాలు, షోడశోపచార పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో వైభవంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

**బ్రహ్మం గారి జీవితం సకల జనులకు ఆదర్శం: అధ్యక్షులు బోల్లోజు ప్రభాకరాచారి**

ఇనుగుర్తి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:

కాలజ్ఞాన ప్రదాత, యుగపురుషుడు శ్రీశ్రీశ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి 333వ ఆరాధనా (జీవ సమాధి) మహోత్సవాలు ఇనుగుర్తిలో ఆదివారం కన్నులపండువగా జరిగాయి. స్వామివారి పీఠం వద్ద ఉదయం నుంచే భక్తిభావం వెల్లివిరిసింది. దేవాలయ అర్చకులు బొల్లోజు చంద్రయ్య చారి ఆధ్వర్యంలో పీఠం వద్ద స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష అభిషేకాలు, పంచామృత స్నానాలు, షోడశోపచార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు బొల్లోజు ప్రభాకరాచారి మాట్లాడుతూ.. బ్రహ్మంగారి ఆశయాలను, బోధనలను స్మరించుకుంటూ ప్రతి ఏడాదీ ఈ ఉత్సవాలను నిర్వహించుకోవడం మన పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణలో క్రమశిక్షణతో జరిగిన ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి పూర్ణచారి, అక్కెర హరీష్, మాజోజు రాజకుమార్, బొల్లోజు నరసింహాచారి, బొల్లోజు రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళాయే




## గూడూరు గుడికి పండుగ శోభ
## నేటి నుండి అధ్యయనోత్సవం
## మే 1న స్వామివారి కళ్యాణోత్సవం

*గూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త*

భక్తులకు కొంగుబంగారంగా విశ్వసించే శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో పండుగ శోభ సంతరించుకోనుంది. శతాబ్దాల చరిత్ర, స్థల పురాణం కలిగి ఉన్న ఈ ఆలయంలో కొలువుదీరి ఉన్న శ్రీ లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 27ను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. చోళుల కాలంలో నిర్మించినట్టుగా చెపుతున్న ఈ ఆలయంలో ఆ కాలం నుండే బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని ఇక్కడి పెద్దల మాట. ఒకప్పుడు భారీ జాతరగా కొనసాగిన బ్రహ్మోత్సవాల వేడుక క్రమంగా ఆదరణ తగ్గుతూ రాగా ఇటీవలి దశాబ్ద కాలంగా మళ్లీ యేటేటా ఉత్సవాల ప్రభావం పెరుగుతూ వస్తున్నది. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలు వైశాఖ బహుళ విదయ వరకు ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఇందులో తొలి మూడు రోజులు అధ్యయనోత్సవాలుగా, మిగిలిన రోజులు బ్రహ్మోత్సవాలుగా కొనసాగిస్తారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం కూడా తెలుగు మాస, తిథుల ప్రకారం ఈనెల 27 నుండి 29 వరకు స్వామి వారి అధ్యయనోత్సవాలు, ఆ తర్వాత 30 సాయంత్రం నుండి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటి ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా 27 సాయంత్రం ద్రావిడ వేద పారాయణంతో అధ్యయనోత్సవాలు ప్రారంభం కానుండగా దీని కొనసాగింపుగా సామూహిక లక్ష్మీ అష్టోత్తర శతనామావళి, తొళ్లక్కం నిర్వహించనున్నారు. తెల్లవారి ఉదయం 7 గంటలకు బాల భోగంతో కార్యక్రమాలు ప్రారంభించి దివ్య ప్రబంధ సేవాకాలం, ఆ తర్వాత సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణంతో రెండో రోజు కార్యక్రమం ముగిస్తారు. 29న ఉదయం యదావిధి పూజా కార్యక్రమాల అనంతరం సాయంత్రం స్వామి వారి గరుడ వాహన సేవ, రాత్రి 8 గంటలకు పరమపదోత్సవం నిర్వహించనున్నారు. 30న ఉదయం ఆలయ ప్రాంగణంలో హనుమాన్ దీక్షా స్వాముల ఆధ్వర్యంలో సామూహిక హనుమానా చాలీస పారాయణం, ఆ తర్వాత పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఆదే రోజు సాయంత్రం బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా విశ్వక్సేనారాధన, స్వస్థి పుణ్యాహావచనం, మృత్యంగ్రహణం, ధ్వజారోహణం (గరుడముద్ద) ఆ తర్వాత చివరగా పల్లకి వాహన సేవ నిర్వహిస్తారు. మే 1న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం భక్తులను అలరించనుంది. ఆరోజు ఉదయం అతి పవిత్రమైన, అనేక శుభఫలితాలనిచ్చే సుదర్శనేష్టి యాగం ప్రారంభించి ఆరోజు సాయంత్రం స్వామి వారి అశ్వవాహన సేవ, అమ్మవారి పల్లికి సేవతో ఎదుర్కోళ్ల వేడుక





నిర్వహించి అదేరోజు రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణం లోని కళ్యాణ మండపంలో స్వామి వారి కళ్యాణోత్సవ వేడుకను కన్నుల పండుగగా నిర్వహించ నున్నారు. ఆ తెల్లవారి ఉదయం పూట నిత్య పూజాధికాల అనంతరం సాయంత్రం 5 గంటలకు బండ్లు తిరుగుడు వేడుక, స్వామి వారి అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. కాగా మే 3న తెల్లవారు జాము నుండి దోపుసేవలో భాగంగా పట్టణంలో దేవతామూర్తుల ఊరేగింపు, ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, పాకాల వాగు వద్ద స్వామి వారి చక్రతీర్థ కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు స్వామి వారి రథోత్సవం, శేషవాహన సేవ, ఆ తర్వాత శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన సేవ, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదిక్షణలతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలకనున్నారు. ఆలయ స్థానాచార్యులు వరదరాజాచార్యులు, అర్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చకబృందం ద్రవిడ ప్రబంద సేవాకాలం, బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ బ్రహ్మోత్సవాల వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## పోచమ్మతల్లి గుడి నిర్మాణానికి భూమిపూజ

*గూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త*

మండలంలోని వెంగంపేట గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ట, పోచమ్మతల్లి గుడి నిర్మాణం కొరకు ఆదివారం భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ కుందూరు శోభన్‌రెడ్డి, ఉపసర్పంచ్ కట్ల విష్ణు మాట్లాడుతూ బొడ్రాయి, గుడి పునర్నిర్మాణం కొరకు కమిటీని



వేసుకొని గ్రామస్తుల నుండి సేకరించిన సుమారు రూ.10 లక్షల విరాళాల మొత్తంతో పునర్నిర్మాణాల కొరకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 35 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసి గ్రామదేవత స్వరూపాలైన శ్రీదేవి, భూదేవి విగ్రహాలు పాక్షికంగా శిథిల దశకు చేరాయని, అంతేగాక గ్రామంలో పోచమ్మతల్లికి సరైన ఆలయం లేకపోవడంతో పంచాయతి పాలకవర్గం, గ్రామపెద్దలు, కులసంఘాలు, యువకులు సమావేశమై బొడ్రాయి పునరుద్దరణ, పోచమ్మతల్లి ఆలయ నిర్మాణం కొరకు నిర్ణయించి దానిని కార్యరూపంలోకి తేవడం జరిగిందన్నారు. భూమిపూజ కార్యక్రమంలో కన్వీనర్ కట్ల వెంకట్‌రెడ్డి, సభ్యులు రాఘవరెడ్డి, ఈర్య, యాదగిరి, సాయిలు, రమేష్, బిక్కు, నర్సింహ, సూరయ్య, రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మక్క రైతుల ఇబ్బందులు పట్టించుకోండి

*గూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త*

కొనుగోలు కేంద్రాల వద్ద గత ఇరవై రోజులుగా నానా అవస్థలు పడుతున్న మొక్కజొన్న రైతుల ఇబ్బందుల గురించి ప్రభుత్వం పట్టించుకొని వారికి తగిన న్యాయం చేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. గూడూరులోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. మొక్కజొన్నలు ఆరబోసుకొని, బస్తాలలో నింపుకొని కాంటాల కోసం ఎదురు చూస్తున్న రైతులతో ఆయన మాట్లాడి వారి ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతు సమస్యల పట్ల రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పట్టించుకోకుండా ఉన్న విధంగానే రైతుల కష్టాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మొక్కల దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని, అదేవిధంగా సకాలంలో ఖాళీ సంచులు సరఫరా చేయడంలేదని, సరిపడిన సంఖ్యలో హమాలీలు అందుబాటులో లేరని, ఫలితంగా కాంటాలు ఆలస్యమై రోజుల తరబడిగా మొక్కజొన్న రైతులు ఎండకు ఎండుతూ కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారన్నారు. రైతుల పరిస్థితి ఇంత దైన్యంగా ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. నిజంగా రైతు క్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మొక్కజొన్న రైతుల ఇబ్బందుల గురించి పట్టించుకోవాలని, వెంటవెంటనే కాంటాలు వేయించి మక్కలను గిడ్డంగులకు తరలించాలన్నారు. ధాన్యం, మక్కలు అమ్ముకున్న రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలని, రైతుల సమస్యలకు సంబంధించి ప్రభుత్వం పట్టింపులేని ధోరణిని ఇదే విధంగా కొనసాగిస్తే ప్రజా ఉద్యమం తప్పదని శంకర్‌నాయక్ అన్నారు. ఆయన వెంట పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ జలగం సంపత్‌రావుతో పాటు ఆరె వీరన్న, కటార్‌సింగ్, రహీంపాషా, భూక్య సురేష్, చీదురు వెంకన్న, బోడ ఎల్లయ్య, నూకల అశోక్, బెజ్జం రమేష్, రాజారాం, కుమార్, సతీష్ పాల్గొన్నారు.



## పరస్పర సహకారమే సంఘానికి బలం

*కేసముద్రం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త*

మండలంలోని అమీనాపురం లో మాల సంఘం సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పురం రమేష్, ఉపాధ్యక్షులు కోడిరెక్క వెంకన్న నాగేల్లి ఆంధ్రయ, బోల్లెద్దు యాకయ్య, ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధర్, సహకార కార్యదర్శి పోతుల రవీందర్, కోశాధికారి: బొల్లెద్దు విజయ్ చందర్, బొల్లెద్దు విజయ్., గౌరవ అధ్యక్షులు శీలం కొమ్మాలు ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆధ్యక్షుడు పురం రమేష్ మాట్లాడుతూ, ఒక సమూహంగా, ఐక్యంగా ఉంటే ఏ ఆపద వచ్చినా కలిసి ఎదుర్కొగలమని, సంతోష సమయాల్లో కూడా పరస్పరం ఆనందాన్ని పంచుకోగలమని అన్నారు. నూతన కార్యవర్గం సభ్యుల ఐక్యతను బలోపేతం చేయడం, పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం, కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపరచడం, పరస్పర సహాయం అందించడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు.



## హిందూ సమ్మేళనానికి తరలిరావాలి

*గూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త*

గూడూరులో ఈనెల 27న పెద్దెత్తున నిర్వహించనున్న హిందూ సమ్మేళానికి భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన అధ్యక్షుడు కందాళం కృష్ణమూర్తి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పింగిలి శ్రీనివాస్ కోరారు. సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేసారు. అనంతరం మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యతను, ధర్మ రక్షణ ఆవశ్యకతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణం వేదికగా ఆరోజు సాయంత్రం నిర్వహించే ఈ సమ్మేళన కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధర్మ ప్రచారకులు ముఖ్య వక్తలుగా హాజరు కానున్నారని, కేవలం ప్రసంగాలే కాకుండా భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కళా ప్రదర్శనలు, భక్తి సంగీత విభావరి కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుండి ప్రతి హిందూ కుటుంబం ఈ ధర్మ ప్రచారంలో భాగస్వాములు కావాలని, హనుమాన్ దీక్షా స్వాములు అందరు తరలిరావాలని కోరారు. స్థానిక ఆలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో బీరం శ్రీపాల్‌రెడ్డి, మేర్గు నరేష్, సురేందర్‌రెడ్డి, శేఖర్, యాదగిరి, నరేష్‌శాస్త్రి, రమణ, మల్లయ్య, స్వరూపరాణి, హెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త



వర్ధన్నపేట మండలం వెంకట్రావు పల్లి గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట మార్కెట్ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య,గ్రామ సర్పంచ్ కల్లా పావని యాకాంతం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా , కాంటాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు ఆలయ ఛైర్మన్ ప్రభాకర్,మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజీ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న,ఏపీఎం రమణాచారి, మహేందర్, చిరంజీవి,నిర్వాహకులు లక్ష్మీ ృ ,మహిళలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భాజపా మండలపార్టీ నూతన అధ్యక్షుడికి సన్మానం

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త



వర్ధన్నపేట బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడి గా నూతనంగా ఎన్నికైన ఇల్లంద గ్రామానికి చెందిన అడువ రాజు ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసిన బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జ్ సట్ల అనిల్, బూత్ అధ్యక్షుడు వేల్పుల కార్తీక్, మూల రాము, యూత్ నాయకులు మైదం కన్నయ్య, మల్లెపాక రాకేష్, మచ్చ రాజు,తాండ్ర హరీష్, పసుల ప్రశాంత్,మల్లెపాక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవం

వర్ధన్నపేట/ఏప్రిల్ 26 ప్రభాత వార్త



ఇల్లంద గ్రామంలో శ్రీ శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి 333 వ ఆరాధనా మహోత్సవం ను విశ్వబ్రాహ్మణ కుల సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇల్లంద గ్రామంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం లో భక్తి శ్రద్ధలతో బ్రహ్మంగారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు స్వామివారిని గ్రామములోని పురవీధుల గుండా ఊరేగించారు బ్రహ్మంగారు చెప్పిన విధంగా కలియుగంలో అనేక వింతలు విశేషాలు జరగబోవు కాలజ్ఞాన విశేషాలు చెప్పిన గొప్ప సంస్కర్త అని విశ్వబ్రాహ్మణ సభ్యులు కొనియాడారు కులమతాలు అంటరానితనంపై అవగాహన కల్పించి అందరూ ఒకటే అనే విషయాలు చాటి చెప్పిన మహానుభావుడని భక్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూజారి రాగి విశ్వరూప చారి ఆరాధన మహోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించగా గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మహిళా భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శంకు పెళ్లి కుమార్ స్వామి , రామగిరి పూర్ణ చారి, దేవేంద్ర చారి, కనుక చారి మంచోజు సత్యనారాయణ, యాదగిరి, రాజన్న, సంతోష్ నాగరాజు, శ్రీనివాస్ ,రామ్మోహన చారి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ కుల సంఘం సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభాతవార్త పర్వతగిరి:

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించేందుకే ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రైతును రాజును చేయాలనేదే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని పర్వతగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో రుద్రమదేవి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా స్థానిక సర్పంచ్ మట్టపల్లి వెంకటేశ్వరరావు ఉప సర్పంచ్ దుర్గేష్ లు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టెంకాయ కొట్టి



ప్రారంభించారు. ఈ సందర్భంగా జాటోత్ శ్రీనివాస్ నాయక్, పిన్నింటి అనిల్ రావులు మాట్లాడుతూ... రైతులు దళారుల చేతిలో దగాపడి నష్టపోకుండా ప్రజా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. తాలు మట్టి గడ్డి రాకుండా ప్యాడి క్లీనర్ ద్వారా శుభ్రపరచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చి నిర్వాహకులకు సహకరించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ .. 2389 కామన్ గ్రేడ్ ..2369 లతో పాటు ప్రోత్సాహకంగా .. 500 బోనస్ ఇచ్చి రైతుకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చౌటపెల్లి, మూడెత్తుల తండా, అన్నారం సర్పంచులు మట్టపల్లి వెంకటేశ్వరరావు గాడపెల్లి మహేందర్ మూడు లకుపతి స్థానిక ఉప సర్పంచ్ పెసర్ దుర్గేష్, సీసీ గోలి కొమురయ్య వివో అధ్యక్షులు సరిత మల్లిక రజిత సెంటర్ ఇంచార్జ్ అరుణ వివోఏలు గుర్రాల విజేందర్ వార్డు సభ్యులు మాజీ ఎంపీటీసీ, తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత ఉత్సాహభరితంగా సాగిన భద్రకాళి బద్వేశ్వరుల బ్రహ్మోత్సవాలు

ఏప్రిల్ 26, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం 0400 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన తర్వాత అమ్మవారికి హరిద్రోత్సవం, బలి ఉత్సవం





నిర్వహించారు. ఆదివారం ఉభయదాతలైన తెలంగాణా గౌడ సంఘం వారి ఆహ్వానం మేరకు అనేక మంది గౌడ కులస్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పట్టుబట్టలు, పూలు, పండ్లు అన్నీ శిరస్సు మీద ధరించి మేళతాళాలతో వేదమంత్రాలతో గుడిలోనికి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి శోడషోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞ గైకొని స్నపనమండపంలోకి వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వందల మంది నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపబడింది. ఆ తర్వాత గ్రహమఖం, దుర్గాహోమం, లక్ష్మీ ృ హోమాదులు జరుపబడ్డాయి. అటుపిమ్మట అమ్మవారికి హరిద్రోత్సవం, అమ్మవారికి బలి ఉత్సవం జరిగినది. ఈ రోజున గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ బొనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యమున ఆదివారం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు ఎరుకొండ పవన్ గౌడ్, కార్పొరేటర్ పోశాల పద్మస్వామి గౌడ్, మాజీ కార్పొరేటర్ నాగపురి సంజయ్ కల్పన, రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి గౌడ్, చింత రమేష్ గౌడ్, దూలం రాజు నీరజ, బుర్ర శ్యాంగౌడ్, దూలం శ్రీనివాస్ మరియు వివిధ జిల్లాల నుండి అనేక మంది గౌడ ప్రముఖులు పాల్గొన్నారు. సాయంకాలం అమ్మవారికి అర్చనాదులు, సాయం ఔపాసన, దీక్షా హోమం, బలిహరణ జరుపబడిన అనంతరం అమ్మవారిని భద్రకాళి మహాత్రిపుర సుందరిగా అలంకరించి రథసేవ జరిపారు. ఈ రథసేవ ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో నిర్వహించబడింది. వందలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ఆహ్లాదకరమైన ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో అమ్మవారి గుడిలో ఈ రథసేవ జరుగుతున్నంత సేపు భద్రకాళి శరణం మమ అనే నామ స్మరణతో దేవాలయ ప్రాంగణమంతా మారుమోగింది. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు దంపతులు తదితరులున్నారు.

# ఐడీఓసిలో ఘనంగా వాసవి మాతా జయంతి వేడుకలు

## పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో



ఐడిఓసి కార్యాలయంలో జిల్లా యువజన సర్వీసులు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వాసవి మాతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని వాసవి మాతకు పూల మాలలు వేసి.ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, శాసన సభ్యులు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి నాడు అత్యంత వైభవంగా జరుపుకునే శ్రీ వాసవి మాత జన్మదినం ఎంతో పవిత్రమైనదని, పార్వతీ దేవి అవతారమైన వాసవి మాత అహింసా మార్గాన్ని అనుసరించి సమాజానికి శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గొప్ప దైవం అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాతా జయంతిని అధికారికంగా జరపాలని ప్రకటించడం చాలా సంతోషమని స్పష్టం చేశారు. ఇది సమాజానికి గౌరవప్రదమైన విషయం మాత్రమే కాకుండా, సమాజంలో అహింసా, ధర్మం, సామాజిక సమానత్వం వంటి విలువలను ప్రోత్సహించే సందర్భంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో వాసవి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ వాసవి మాత ఆశీస్సులు లభించాలని కోరుకుంటూ, శాంతి, ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ృ, మున్సిపల్ ఛైర్మన్ బుర్రా కొమురయ్య, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రఘు, కౌన్సిలర్లు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## వరి దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):

ఎలుకుర్తి గ్రామంలో గ్రామ ఐక్య సంఘం ప్రగతి ఎస్‌జీ1 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం మహిళా గ్రామైక్య సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. సన్న రకం ధాన్యానికి రూ. 2,389, దొడ్డు రకానికి రూ. 2,369 మద్దతు ధరతో పాటు సన్న రకానికి రూ. 500 బోనస్ ఇస్తోందని తెలిపారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. రైతులకు ఏటా రూ. 12,000 పెట్టుబడి సాయం అందిస్తున్నామని, త్వరలో ఇందిరా బీమా పథకం ద్వారా కుటుంబ పెద్ద మరణిస్తే రూ. 5 లక్షల బీమా 15 రోజుల్లో అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేష్ నాయక్, ఏపీఎం మహేందర్, సీసీ కవిత, సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, ఉపసర్పంచ్ రమేష్, కమిటీ సభ్యులు రజిత, మనెవ ్మ, అనిత, విద్య, సరి ౕ, స్వరూప, హవ ాలి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూకార్యక్రమంలో పాల్గొన్న,తొట్ల.రాజు యాదవ్



,ఏప్రిల్26(ప్రభాతవార్త)కాజిపేట్ మండల్

వర్ధన్నపేట నియోజకవర్గంలోని కాజీపేట మండల్ లోని 46 డివిజన్లోని మడికొండ నగరం చెందిన ఎండి, అమీనాబేగంకి ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ కార్యక్రమంలో మాజీకార్పొరేటర్, తొట్ల. రాజు యాదవ్,. ఇందిరమ్మ కమిటీ సభ్య లు, వసు , అరూరు. తిరుపతి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ చైర్మన్,జంగా.రాఘవరెడ్డి

ఏప్రిల్26(ప్రభాతవార్త)కాజిపేట్ మండల్



మామ్నూర్ లోని వినయ్ ఫంక్షన్ హాల్ లో వర్ధన్నపేనియోజకవర్గంలోని అయినవోలు మండల్ ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన బండి. కుమార్ కుమారుడైన బండి. రాజు, కస్తూరి వివాహంలో పాల్గొని నూతవధువరులకు శుభాకాంక్షలుతెలియజేసి, ఆశీర్వదించిన తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, జంగా. రాఘవరెడ్డి, నూతన దంపతుల దాంపత్య, జీవితం, ఆనందంగా, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో నిండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్, మార్నేని. రవీందర్రావు, మాజీ కార్పొరేటర్, తొట్ల. రాజుయాదవ్, బండి. శీను, బంధుమిత్రులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

## వరల్డ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ లో మేధా హై స్కూల్ విద్యార్థులు

ఏప్రిల్26(ప్రభాతవార్త)కాజిపేట్ మండల్

హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం లో జరిగిన వరల్డ్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ లో కాజిపేట్ రహమత్ నగర్ చెందిన మేధా హైస్కూల్ ఏడుగురువిద్యార్థులు పాల్గొనివిజ యవంతంగా ,ఎ నిలిచారు. వీరిని స్కూల్ చైర్మన్, డైరెక్టర్, డాక్టర్, వి. మధుకర్ రెడ్డి, దివ్యశృతి రెడ్డిఅభినందించారు



## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి వినతి

ధర్మసాగర్ ఏప్రిల్ 26 (ప్రభాతవార్త )

: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించి 1996 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ బి ఎన్ ఆర్ కె ఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకులు వైద్యం, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్యలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సమాజానికి అద్భుతమైన నిర్మాణాలు అందిస్తున్నప్పటికీ, వారికి కనీస భద్రత, సంక్షేమం, నీడ లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా ఉద్యమాలు, రాస్తారోకోలు, పోరాటాల ఫలితంగా 1996 చట్టం వచ్చినప్పటికీ కార్మికులకు పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందడం లేదన్నారు. గత పాలనలో చట్టం నిర్వీర్యమైందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో కార్మికుల్లో ఆశలు చిగురించాయని తెలిపారు. నిర్వీర్యమైన చట్టాన్ని తిరిగి సమర్థంగా అమలు చేసి కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని, అసెంబ్లీలో కార్మికుల గోడును వినిపించాలని మంత్రిని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు

## స్నేహమేరా జీవితం

.కమలాపూర్: ప్రభాత వార్త.

.హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో 30 ఏళ్ల నాటి స్నేహబంధం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. గ్రామానికి చెందిన పుల్ల అశోక్ అకాల మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడగా, ఆయనతో 199596లో పదవ తరగతి చదివిన మిత్రులు ఆదుకునేందుకు ఒక్కటయ్యారు. అశోక్ హఠాన్మరణం విషయం తెలుసుకున్న అశోక్‌తో కలిసి 199596లో పదవ తరగతి చదివిన మిత్రులు చలించిపోయారు. మానవత్వంతో ముందుకు వచ్చి ..17,500 విరాళాలు సేకరించి అశోక్ కుటుంబానికి అందజేశారుస్నేహానికి కాలం చెల్లదు, ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహం" అని వారు తెలిపారు. మూడు దశాబ్దాల తర్వాత కూడా స్నేహాన్ని ఇలా నిలబెట్టుకోవడం, కష్టంలో ఉన్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల ఉప్పల్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల వయసులో నాటిన స్నేహ బీజం 30 ఏళ్ల తర్వాత కూడా నీడనిస్తూనే ఉందని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్వీ పోరుబామాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త )

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్వీ నిర్వహించనున్న పోరుబాటకు సంబంధించిన గోడ పత్రికను హన్మకొండలోని తన నివాసంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ. 8 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యల దృష్ట్యా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, కాకతీయ యూనివర్సిటీ రజక సంఘం ఇన్‌చార్జ్ కోరపెల్లి రాజేష్, బొమ్మ ఉజ్వల్, నడికూడ మండల అధ్యక్షుడు ధురిశెట్టి రేవంత్, పరకాల రూరల్ అధ్యక్షుడు గొట్టే అజయ్, కంటత్మకూర్ గ్రామ అధ్యక్షుడు గుడికందుల శివ, ఐలోని అభిషేక్, గంధ్రకోట పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్‌లో బడిబాట కార్యక్రమం

.కమలాపూర్: ప్రభాత వార్త.

కమలాపూర్ మండల కేంద్రంలో బీసీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం వార్డెన్ కట్టయ్య ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రతి ఒక్క బిడ్డ ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఒకప్పటి ప్రభుత్వ బడులు కావివి. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని వసతులతో మన ప్రభుత్వ బడులు సిద్ధంగా ఉన్నాయి" అని వార్డెన్ కట్టయ్య వివరించారు. "వసతి గృహంలో ఉంటే పిల్లలకు చదువుపై పూర్తి ఏకాగ్రత కుదురుతుంది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి ప్రతి విద్యార్థి సందేహాలను నివృత్తి చేస్తాం. తోటి విద్యార్థులతో కలిసి గ్రూప్ స్టడీస్ చేసుకునే అవకాశం ఉంటుంది. 24 గంటల రక్షణ, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ అన్నీ మేమే చూసుకుంటాం. మీ పిల్లల్ని మా కుటుంబ సభ్యులుగా చూసుకుంటాం" అని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. బడిబాటలో భాగంగా వార్డెన్ కట్టయ్య, ఇతరులు మండల కేంద్రంలోని వీధుల్లో పర్యటించారు. "ప్రభుత్వ బడి మన బడి, బంగారు భవితకు ఇదే వేదిక" అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలకు వేలు ఫీజులు కట్టి అప్పులపాలయ్యే కంటే, ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ బడులను ఎంచుకోవాలని సూచించారు. "ఈరోజు ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులే రేపు కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అవుతున్నారు. పేదరికం చదువుకు అడ్డుగోడ కాకూడదు. ప్రతి బిడ్డ బడిలో ఉండాలన్నదే మన ప్రభుత్వ లక్ష ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, ఆశ వర్కర్, ఏఎన్ఎంలు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించాలి

పరకాల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త )



బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరు, వాడ తోరణాలు, జెండాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలని బిఆర్ ఎస్ పరకాల మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి పార్టీ శ్రేణులకు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష ్యంగా ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 26 సంవత్సరాలు పూర్తయిందని చెప్పారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం లో వేడుకలను నిర్వహించాలన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా పరకాల మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ గద్దెలకు రంగులు వేసి ఉదయం 8:00 గంటలకు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి ఉదయం 9:00 గంటలకు మండల, గ్రామాల్లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో జరగాలని, మండల నాయకులు, గ్రామ స్థాయి కార్యకర్తలు అందరూ ఐక్యంగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని మధుసూదన్ రెడ్డి కోరారు.

## వైభవంగా శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం

నడికుడ, ఏప్రిల్ 26(ప్రభత వార్త):

జగద్గురు కాలజ్ఞాన కర్త శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం నడికూడ మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ దశమి ఆదివారం రోజున వైభవంగా నిర్వ హించారు. గణపతి పూజ, గోత్రనా మర్చనాలు, బ్రహ్మంగారి సంకల్పం మొదలుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారి చిత్రపటానికి మాలాధారణ, గంధం, పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మంగారి పూజా కార్యక్రమాలు యధావిధిగా ప్రతి సంవత్సరం సాంప్రదాయ బద్ధంగా చేపట్టడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడివెండి నరేందర్ చారి, గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి వెంకటయ్య చారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలకంటి రాజు చారి, ఉపాధ్యక్షుడు బెజ్జంకి రాజేందర్ చారి, ప్రధాన కార్యదర్శి బండ్ల రాజు చారి, కోశాధికారి కడివెండి ప్రశాంత్ చారి, సహాయ కార్యదర్శి బండ్ల రమేష్ చారి, కమిటీ సభ్యులు క్రిష్ణాది సాంబయ్య చారి, కడివెండి రాజు చారి, విఘ్నేష్ చారి, పాల్గొన్నారు



## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్వీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ..చల్లా ధర్మారెడ్డి,

నడికుడ,ఏప్రిల్ 26(ప్రభత వార్త) :

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే శ్రీ చల్లా ధర్మారెడ్డి తెలిపారు.బీఆర్ఎస్వీ నిర్వహించనున్న పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండలోని తన నివాసంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.8 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యార్థుల సమస్యల దృష్ట్యా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, కాకతీయ యూనివర్సిటీ రజక సంఘం ఇన్‌చార్జ్ కోరెపెల్లి రాజేష్, బొమ్మ ఉజ్వల్, నడికూడ మండల అధ్యక్షుడు ధురిశెట్టి రేవంత్, పరకాల రూరల్ అధ్యక్షుడు గొట్టె అజయ్, కంటత్మకూర్ గ్రామ అధ్యక్షుడు గుడికందుల శివ, ఐలోని అభిషేక్, గంద్రకోట పవన్ తదితరులు పాల్గొన్నారు

## మే 1న జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

బీబీనగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

:మండల పరిధిలోని కొండమడుగు గ్రామంలో మే 1న జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కరపత్రాలను సర్పంచ్ కడెం పాండురంగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజాన్ని చైతన్య పరిచేందుకు హిందువులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళనం కార్యక్రమానికి కాశి 41వ పీఠాధిపతి శ్రీ శ్రీ శివ నాగేంద్ర సరస్వతి మహాస్వామి పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరిగె శ్రీధర్, హిందూ సమ్మేళన సమితి కొండమడుగు ఉప మండలం అధ్యక్షులు మాశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి కడెం సాయి ప్రసాద్, కార్యదర్శులు కనక బోయిన రాజ మల్లేష్, ఆరిగె వెంకటేష్, వార్డు సభ్యులు భాను శ్రీ వేణు, మంద భాస్కర్, కడెం వెంకటేష్, కనక బోయిన కిషోర్, రాష్ట్రీయ స్వయంసేవక్ సభ్యులు అంశాల అరవింద్, దూసరి నరేష్, గోమాత పరిరక్షణ సమితి నాయకులు బాబు రావు, నాయకులు దేశం శ్రీనివాస్ గౌడ్, దేశం శ్రీకాంత్, భజన మండలి సభ్యులు మాదిరెడ్డి శివరాం రెడ్డి, జస్వంత్ సింగ్, అల్లాదుర్గం మహేష్, శివ చరణ్ సింగ్, శివలక్ష్మి ,గుండ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కష్టమర్లకు అన్ని రకాల వసతులు కల్పించాలి

సూర్యాపేట, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త)

:సూర్యాపేట పట్టణం నడిబొడ్డిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన 30 ఎకరాల విశాలమైన ప్రదేశంలో పటేల్స్ పెరల్ పేరుతో కౌన్సిలర్ తన్వీర్ ఆధ్వర్యంలో అతిపెద్ద వెంచర్ ను ఏర్పాటు చేయడం హర్షనీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు సూర్యాపేట కలెక్టరేట్ సమీపంలోని పటేల్స్ పెరల్ వెంచర్ ను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. న్ని రకాల అనుమతులు తీసుకొని ఇంటి నిర్మాణానికి అనువుగా అభివృద్ధి చేసిన పార్చ్యూన్ గ్రూప్, అశ్వి కన్స్ట్రక్షన్స్ వారికి అభినందనలు తెలియజేశారు. సూర్యాపేట పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందని, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో అన్ని సౌకర్యాలతో, ప్లాట్లు చేశారని, పట్టణ ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. కేవలం రెండు మూడు నెలలలోనే ఈ ప్లాట్లు అన్ని కూడా కొనుగోలు అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. కౌన్సిలర్ తన్వీర్ కుటుంబం ఇక్కడ స్థానికంగా భూస్వాములని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ లు తన్వీర్, కొండపల్లి దిలీప్ రెడ్డి, పార్చ్యూన్ గ్రూప్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీటీసీ.. బియ్యం అందజేత.

.కమలాపూర్: ప్రభాతవార్త.



కమలాపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పుల్ల ఎర్ర ఇజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయిన ఆ కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం చెప్పారు.మానవతా దృక్పథంతో స్పందించిన వెంకటేశ్వర్లు తక్షణ సాయంగా 50 కిలోల బియ్యాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, మనోధైర్యం కల్పించాడు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

హసన్ పర్తి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త.



హసన్ పర్తి మండల పరిధిలోని పెగడపల్లి గ్రామంలో పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూరైతులు తప్పనిసరిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించాడు. రైతును రాజుగా నిలబెట్టడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపాడు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో శ్రీ రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నదని వెల్లడించా డు. రైతు సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుందని, గతంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు పక్షపాతాన్ని మరోసారి నిరూపించిందన్నాడు.తెలంగాణ దేశానికే అన్నం పెట్టే ధాన్యాగారంగా రూపుదిద్దుకుంటోందని, రైతులు పండించిన ప్రతి ధాన్య గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం . రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరిస్తూ, తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని పిలుపునిచ్చాడు.కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపాడు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు, మోసాలకు పాల్పడినా ఉపేక్షి ంచేది లేదని కఠిన హెచ్చరిక జారీ చేశాడు.ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, తంగళ్ళపల్లి తిరుపతి , దేవరకొండ అనిల్ , వీసం సురేందర్ రెడ్డి , రమేష్ ,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మూగ జీవాలకు సేవలందించే డాక్టర్ దేవుడితో సమానం

ఏప్రిల్ 26, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్

:ఆదివారం తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ జెడ్ కన్వెన్షన్ హాల్, పరిమళ కాలనీ నందు మూగ జీవాలకు వరల్డ్ వెటర్నరీ డే 2026 కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమును తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా చనిపోయిన వెటర్నరీ డాక్టర్లకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాము, కోశాధికారి డాక్టర్ బాలాజీ, ఉపాధ్యక్షులు డాక్టర్ గోపాల్ రావు, డాక్టర్ వినయ్, డాక్టర్ ఊర్మిళ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవీందర్, డాక్టర్ అశోక్, డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో సీనియర్ వెటర్నరియన్స్ అందరిని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు అందరూ వెటర్నరీ డాక్టర్లు అందించే సేవలు అమూల్యమైనవని, మూగజీవాలకు సేవలు అందించే వెటర్నరీ డాక్టర్ దేవునితో సమానం అని, దేశ జిడిపి లో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖపాత్ర మరువలేనిది అని, పశు వైద్య వృత్తి సవాళ్లతో కూడుకున్నది అని, ది బెస్ట్ డాక్టర్స్ ఇన్ ద వరల్డ్ వెటర్నరీ డాక్టర్స్ అని అన్నారు. కార్యక్రమంలో క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వెటర్నరీ డాక్టర్లకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్. ఎం. బాలక్రిష్ణ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు, ముఖ్య అతిథులుగా విచ్చేసినారు. మాట్లాడుతూ కేవలం డాక్టర్ మాత్రమే తెరిచే హాస్పిటల్ లు ఉన్నాయి. వేరే డ్యూటీ కి వెళ్ళి హాస్పిటల్ కి వెళ్లకపోతే ఒక రైతు నష్టపోతాడు అని ఆవేదన తప్ప వేరే ఆలోచన లేదు అనే మెసేజ్ జిల్లా అధికారులకు తెలియాలి, అదనపు బాధ్యతలు ఇవ్వకుండా డిమాండ్ చేయాలి అని అన్నారు. అతి త్వరలో రీ ఆర్గనైజేషన్ కావాలని ఉద్యోగులందరూ మమేకమై మే 5న నిరసన కార్యక్రమానికి తరలిరావాలని తెలిపారు. హనుమకొండ జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై. రాధా కిషన్, జనగామ జిల్లా ఆఫీసర్ డాక్టర్. ఎస్. మురళీధర్ రావు, మంచిర్యాల జిల్లా అధికారి డాక్టర్ పి. యాకూబ్ రెడ్డి , సిద్దిపేట జిల్లా అధికారి డాక్టర్ గోపాల కృష్ణమూర్తి, తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం. రమేష్ బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ పి. శ్రీనివాస్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయ ప్రవీణ్, రిటైర్డ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. చంద్రమౌళి, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ సంపత్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ని వెటర్నరీ డాక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఇంటాస్, వీర్ బ్యాక్, నాచురల్ రెమెడీస్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో కార్యక్రమంలో పాల్గొన్న వారిని మంత్రముగ్ధులను చేయడం జరిగింది

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి వినతి

ధర్మసాగర్ ఏప్రిల్ 26 (ప్రభాతవార్త )

: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించి 1996 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ బి ఎస్ ఆర్ కె ఎస్ తెలంగాణ రాష్ట్ర నాయకులు వైద్యం, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్యలు ఈ భేటీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సమాజానికి అద్భుతమైన నిర్మాణాలు అందిస్తున్నప్పటికీ, వారికి కనీస భద్రత, సంక్షేమం, నీడ లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా ఉద్యమాలు, రాస్తారోకోలు, పోరాటాల ఫలితంగా 1996 చట్టం వచ్చినప్పటికీ కార్మికులకు పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందడం లేదన్నారు. గత పాలనలో చట్టం నిర్వీర్యమైందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో కార్మికుల్లో ఆశలు చిగురించాయని తెలిపారు.నిర్వీర్యమైన చట్టాన్ని తిరిగి సమర్థంగా అమలు చేసి కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని, అసెంబ్లీలో కార్మికుల గోడును వినిపించాలని మంత్రిని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు

రుజువు చేసింది